# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :125 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 11-07-2024 | పేజీలు:4 వెల: 2.00


## జూ కీపర్‌పై సింహం దాడి...

హైదరాబాద్, హైదరాబాద్ జూ పార్క్‌లో ఎనిమిల్ కీపర్‌పై సింహం దాడి చేసింది. ఈ దాడిలో కీపర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్క్‌లో ఉ సంగడ్డకు చెందిన హుస్సేన్(40) ఎనిమల్ కీపర్‌గా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే.. హుస్సేన్ సమ్మర్ హౌస్‌లో ఉన్న సింహాలు ఉండే ఎన్‌క్లోజర్ వద్దకు వెళ్లాడు. ఆడ సింహం (శిరీష) ఉన్న ఎన్ క్లోజర్ వద్దకు వెళ్లాడు. ఆ సింహాన్ని పక్కనున్న మరో ఎన్‌క్లోజర్‌లోకి పంపించాడు. అయితే, ఆ ఎన్ క్లోజర్‌ను లాక్ చేయడం మర్చిపోయిన హుస్సేన్.. తన పనిలో తాను నిమగ్నమైపోయాడు. ఇంతలో పక్కనున్న ఎన్ క్లోజర్ నుంచి సింహం అతనివైపు దూసుకొచ్చింది. అతనిపై దాడి చేసింది. సింహం పంజా దెబ్బకు హుస్సేన్ కొంత దూరంలో పడిపోయాడు. గాయపడిపోయిన హుస్సేన్ ఎన్ క్లోజర్ గేట్ బోల్ట్ పెట్టకుండా బయటికి పరుగులు తీశాడు. దీంతో ఆ ఆడ సింహం కూడా ఎన్ క్లోజర్ నుంచి బయటికి వచ్చింది. సమాచారం అందుకున్న జూ అధికారులు, వెటర్నరీ అధికారులకు సమాచారం ఇచ్చారు.

## విభజన సమస్యలపై పంతాలకు పోకుండా.. శాశ్వత పరిష్కారం చేసుకోవాలి



నల్లగొండ : చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు భేటీ అవ్వడం శుభ పరిణామం అని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. విభజన సమస్యలపై పంతాలకు పోకుండా ఇరు రాష్ట్రాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. నల్లగొండలోని క్యాంపు మీడియాతో గుత్తా సుఖేందర్ రెడ్డి చిట్ చాట్ చేశారు.రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలు త్వరలోనే పరిష్కరం అవుతాయి అనే నమ్మకం కలిగింది. రెండు రాష్ట్రాల సీఎంలు కలవడాన్ని అభివృద్ధి కోణంలో చూడాలి. అందులో రాజకీయ కోణం చూడవద్దు. ప్రతిపక్ష పార్టీలు చేసే బెదిరింపులకు అసహనం కలుగుతుంది.. అప్పుడే అభివృద్ధి పనులు చేసుకోగలుగుతాం. తెలంగాణ రాష్ట్రానికి ఎత్తిపోతల ద్వారా నీటిని తీసుకోవడం తప్ప మినహా మరో మార్గం లేదు. కృష్ణా జలాల విషయంలో న్యాయబద్ధంగా తెలంగాణకు వాటా ఇవ్వడానికి ఏపీ ప్రభుత్వం సహకరించాలి. ఇరిగేషన్ ప్రాజెక్టులు అన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారు. వచ్చే రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ పెండింగ్ పనులు పూర్తి చేస్తే జిల్లాలో సాగునీటి సమస్యలు తీరా గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు.శాసన మండలి రద్దు అనేది అసంబద్ధమైనది. అలాంటి పరిస్థితి ఏం లేదు. 2026లో పునర్విభజన చట్టం అమలయ్యే అవకాశం ఉంది. ఈ చట్టం అమలైతే తెలంగాణలో 34, ఏపీలో 50 సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఆర్థిక పరిస్థితి బాగాలేదని రూ. 7 లక్షల కోట్ల అప్పు ఉందని రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేసింది. అనవసర ఖర్చులు తగ్గించుకోవడం మంచిది. రైతు బంధు, రైతు భరోసా కేవలం పది ఎకరాల వరకు ఇస్తే చాలు. సేద్యం చేసే భూములకు మాత్రమే రైతు బంధు ఇవ్వాలి. రైతు భరోసా, రైతు రుణమాఫీ అర్హులైన వారికే ఇవ్వాలి. శాసన మండలి ఛైర్మన్ హోదాలో ఉండి రాజకీయాల గురించి మాట్లాడను. పార్టీ ఫిరాయింపుల విషయంలో గతంలో ఉన్న శాసన మండలి ఛైర్మన్, స్పీకర్ ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారో మేము కూడా అలాగే తీసుకుంటాం. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు చాలా కష్టపడుతున్నారు. జిల్లాలో ఉన్న పెండింగ్ పనులన్నీ త్వరగా పూర్తి అవుతాయని అనుకుంటున్నాను. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం మంచిదే అని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## పరిశ్రమలకు ఇచ్చిన భూముల తనఖా

హైదరాబాద్,జూలై10, రాష్ట్ర ఆర్థిక రంగాన్ని సరిగ్గా నడపడం చేతకాని రేవంత్ సర్కార్ ఇప్పుడు నిధుల సమీకరణకు ఒక ప్రమాదకరమైన మార్గం ఎంచుకున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ పరిశ్రమల శాఖకు చెందిన రూ. 20 వేల కోట్ల విలువైన 400 ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలకు తనఖాపెట్టి రూ.10 వేల కోట్లు సమీకరించాలని భావిస్తున్నట్టు సమాచారం ఉందని ఆయన తెలిపారు. దీనికి మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్‌ను పెట్టి వారికి రు.100 కోట్ల కమిషన్ ఇచ్చేందుకు సిద్ధమైంది అని మీడియాలో కథనాలు వస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మతిలేని చర్య వల్ల తెలంగాణ ప్రగతి శాశ్వతంగా కుంటుపడి, కొత్తగా పెట్టుబడులు, పరిశ్రమలు రాక, ఉద్యోగాలు రాక, మన బిడ్డలకు కొలువులు రాకుండా పోయే ప్రమాదం ఉన్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. అలాంటి చోట 400 ఎకరాలు ప్రైవేట్ సంస్థలకు తనఖా పెట్టడం అనాలోచిత చర్య. అసలే గత ఏడు నెలలుగా రాష్ట్ర పారిశ్రామికరంగం స్తబ్దుగా ఉంది. కొత్తగా పెట్టుబడులు రావడం లేదు. ఉన్న కంపెనీలు కూడా సరైన



ప్రోత్సాహం లేక పక్కచూపులు చూస్తున్నాయి. ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కొరకు పరిశ్రమలకు ఇచ్చే భూములు తాకట్టు పెడితే.. కంపెనీలకు ఏమిస్తారు? కొత్తగా మన యువతకు ఉద్యోగాలు ఎట్లా వస్తాయి? అని రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ నిలదీశారు.

## వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందాం



ఖమ్మం : రైతుల ఆలోచనతోనే రైతు భరోసా విధివిధానాలు రూపొందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన రైతు భరోసా పథకం ప్రజాభిప్రాయసేకరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దృఢ సంకల్పంతో ముందడుగు : భట్టి

ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందామని, అందులో భాగంగా పెట్టుబడి అందజేయడం కోసం రైతు భరోసా అమలు చేయడానికి తమ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందడుగు వేస్తోందని చెప్పారు. రైతుభరోసాపై విధివిధానాల ఖరారు కోసం రైతు సంఘాలు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు వెల్లడించారు. అన్నిజిల్లాలో అభిప్రాయాలు సేకరించి, త్వరలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు.

గత ప్రభుత్వంలా కాదు : పొంగలేటి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏ స్కీమ్ చేపట్టినా ప్రజల అభిప్రాయాలు తీసుకోలేదన్నారు. నాలుగు గోడల మధ్య నిర్ణయం తీసుకుని ప్రజలపై రుద్దారన్నారు. ప్రభుత్వానికి వచ్చే ప్రతీపైసా ప్రజల నుంచి వచ్చిందేనని, రైతులు ఇచ్చే సూచనలపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

రైతులను ఆదుకోవడమే : తుమ్మల

ఖమ్మం జిల్లాకు చెందిన మరో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రైతుల ఆలోచన మేరకే ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. రైతుల అభిప్రాయం తీసుకున్నాకే రైతు భరోసాపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.రైతాంగాన్ని ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.

రేపు ఆదిలాబాద్‌లో ప్రజాభిప్రాయసేకరణ

రైతు భరోసా అమలుపై తెలంగాణ సర్కార్ కసరత్తు చేస్తోంది. జిల్లాల వారీగా అభిప్రాయాలను సేకరిస్తోంది. అందులో భాగంగా ఈ రోజు ఖమ్మం జిల్లాలో మంత్రుల బృందం పర్యటించి ప్రజల అభిప్రాయాన్నిసేకరించింది. జిల్లాల పర్యటన ముగిసిన తరువాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటోంది. 11న అదిలాబాద్, 12న మహబూబ్ నగర్, 15న వరంగల్, 16న సంగారెడ్డి(మెదక్), 18న నిజామాబాద్, 19న కరీంనగర్, 22న నల్గొండ, 23న రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయాల్లో రైతుల నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్లు షెడ్యూల్?ను రూపొందించారు.

## వరదలకు అస్సాం అతలాకుతలం.. 92కు పెరిగిన మృతులు

అస్సాం: అస్సాంలో వరద (అస్సాం వరదలు) బీభత్సం కొనసాగుతోంది. ఈ వరదలు జన జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు ప్రమాదకరస్థాయిని మించి ప్రవహించాయి. అయితే, ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రధాన నదులు, వాటి ఉపనదుల్లో నీటి మట్టం తగ్గుముఖం పట్టినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 17.70 లక్షల మంది వరదలకు తీవ్ర ప్రభావితులయ్యారు. వరదల కారణంగా నిన్న ఒక్కరోజే ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు.అస్సాం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (అస్సాం స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ) ప్రకారం.. మంగళవారం ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. కాచర్‌లో ఇద్దరు మరణించారు.. ధుబ్రి, ధేమాజీ, సౌత్ సల్మారా, నాగావ్, శివసాగర్ జిల్లాలో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ఏడాది వరదలు, కొండ చరియలు విరిగిపడటం, తుపాను కారణంగా రాష్ట్రంలో మృతి చెందిన వారి సంఖ్య 92కి పెరిగింది. అందులో ఒక్క వరదల కారణంగానే 79 మంది ప్రాణాలు కోల్పోయారు.

వరదలకు 17.70 లక్షల మంది ప్రభావితం..

వరదల కారణంగా శుక్రవారం నాటికి 27 జిల్లాల్లో 18.80 లక్షల మంది ప్రభావిత కాగా.. మంగళవారం నాటికి ఆ 17.70 లక్షలకు తగ్గింది. 38,870.3 హెక్టార్ల సాగు భూములు ముంపునకు అందుబాటులో ఉన్నాయి. 3,54,045 జనాభా కలిగిన ధుబ్రి జిల్లా ఈ వరదలకు తీవ్రంగా ప్రభావితమైంది. ఆ తర్వాత కాచర్ (1,81,545 మంది జనాభా), శివసాగర్ (1,36,547), బార్‌పేట (1,16,074), గోలాఘాట్ (1,09,475) వరద ప్రభావానికి గురైనట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 48,021 మంది బాధితులు



507 మంది సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. సుమారు 1,04,665 మందికి అధికారులు సహాయక సామగ్రిని అందించారు.

కజిరంగా పార్క్‌లో 159 వన్యప్రాణులు మృత్యువాత

ప్రఖ్యాత కజిరంగా నేషనల్ పార్క్ (కజిరంగా నేషనల్ పార్క్)ను ఇటీవల కాలంలో ఎన్నడూ లేనివిధంగా వరదలు ముంచాయి. దీంతో మొత్తం 159 మంది వన్యప్రాణులు మరణించారు. 20 జంతువులు వరదలో కొట్టుకుపోయాయి. సుమారు 133 జంతువులను అధికారులు రక్షించి సురక్షిత ప్రాంతాలకు ఉ న్నారు. ఈ వదరలకు రాష్ట్రంలో 13,66,829 జంతువులు దెబ్బతిన్నాయి. వరదల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 94 రోడ్లు పూర్తిగా దెబ్బతినగా.. మూడు వంతెనలు కొట్టుకుపోయాయి. 26 ఇళ్లు, ఆరు కట్టలు కూడా దెబ్బతిన్నాయి. ఇక నిమతిఘాట్, తేజ్‌పూర్, గౌహతి, ధుబ్రి వద్ద బ్రహ్మపుత్ర నది ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తోంది.

## కర్ణాటకలో ముడ కుంభకోణం ప్రకంపనలు..



బెంగళూర్ :మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కుంభకోణం కర్ణాటక (కర్ణాటక)లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే ఈ స్కామ్ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ స్కామ్ ద్వారా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య (సిద్ధరామయ్య) భార్య పార్వతమ్మ లబ్ధి పొందారని ఆరోపిస్తూ ఓ సామాజిక కార్యకర్త (సామాజిక కార్యకర్త) తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఎం దంపతులు సహా తొమ్మిది మందిపై మైసూరులోని విజయనగర్ పోలీస్ స్టేషన్‌లో సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ (స్నేహమయి కృష్ణ) కంప్లైంట్ ఇచ్చారు.భూకేటాయింపుల కుంభకోణంలో సీఎం సహా ఆయన సతీమణి పార్వతమ్మ, ముడా అధికారులతోపాటు మైసూరు జిల్లా కలెక్టర్, ఇతర ప్రభుత్వ అధికారుల ప్రమేయం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై చర్యలు స్నేహమయి డిమాండ్ చేశారు. అయితే ముడా అవకతవకలపై ఇప్పటికే దర్యాప్తు కొనసాగుతోందని చెబుతూ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు.

ఇంతకీ ఏం జరిగిందంటే..

సిద్ధరామయ్య, ఆయన కుమారుడు, ఎమ్మెల్సీ యతీంద్ర రూ. 4000 కోట్ల భూకుంభకోణానికి నిర్బంధించారని ఆ రాష్ట్ర బీజేపీ ఆరోపిస్తోంది. సొంత జిల్లా మైసూరులో సీఎం తన సతీమణి పార్వతమ్మ పేరుతో చట్టవిరుద్ధంగా కోట్ల విలువజేసే భూములు కేటాయించుకున్నారని ప్రతిపక్ష బీజేపీ నాయకుడు ఆర్ అశోక్. ఈ కుంభకోణంలో మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ప్రమేయం కూడా ఉంది. విషయం బయటకు రాకుండా ఉండేందుకే వారిని ప్రభుత్వం ఉన్నట్టుండి బదిలీపై పంపించింది. ఈ కుంభకోణం వివరాలు పూర్తిగా వెలుగులోకి రావాలంటే సీబీఐతో లేదా రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఏమిటీ స్కాం?

బీజేపీ నేతల ఆరోపణల ప్రకారం.. మైసూరు శివారుల్లోని గ్రామీణ ప్రాంతాల్లో సిద్ధరామయ్య భార్య పార్వతమ్మకు 3 ఎకరాల 16 గుంటల భూములు ఉ న్నాయి. అయితే, అవసరాల దృష్ట్యా ఆ భూములను సేకరించిన ప్రభుత్వం.. వాటికి బదులుగా నగరంలోపల అత్యంత ఖరీదైన ప్రాంతాలుగా చెప్పుకొనే విజయనగర్, దట్టగల్లీ, జేపీ నగర్, ఆర్టీ నగర్, హంచయా-సతాగల్లీలో సిద్దు కుటుంబానికి భూములను కేటాయించింది. 50:50 నిష్పత్తిలో (పడావు పడ్డ ఒక ఎకరా తీసుకొంటే, అభివృద్ధి చేసిన అర్ధ ఎకరం ఇవ్వడం) ఈ భూముల కేటాయింపు జరిగింది. అయితే, సిద్దు కుటుంబానికి అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఆ భూములను కేటాయించాలని ఎవరు గుర్తించారు. క్యాబినెట్ అనుమతి లేకుండా భూములు కేటాయించే అధికారం ఎవరికి ఉంటుందని, ముఖ్యమంత్రికి తెలియకుండానే ఇంత పెద్ద కుంభకోణం జరిగిందా? అని ఆయన ప్రశ్నించారు.

నాకేమీ తెలియదు: సీఎం సిద్ధరామయ్య

బీజేపీ నేతల ఆరోపణలను సీఎం సిద్ధరామయ్య ఖండించారు. తమ కుటుంబానికి ఎవరు, ఎలా ఆ భూములను కేటాయించారో తనకు తెలియదని చెప్పారు. బీజేపీ హయాంలోనే ఈ కేటాయింపులు జరిగినట్టు చెప్పుకొచ్చారు. రింగ్‌రోడ్డుకు సమీపంలో తన భార్య పేరుతో 3.16 ఎకరాల భూమి ఉన్న మాట వాస్తవమేనని. తమ 3.16 ఎకరాలను సేకరించకుండానే ముడా అధికారులు అక్కడ లే అవుట్ వేశారని చెప్పారు. ఆ స్థలాలను లబ్ధిదారులకు పంపిణీ కూడా చేశారు. చట్ట ప్రకారం మా భూములకు బదులుగా 50:50 ప్రాతిపదికన వేరేచోట భూములు ఇస్తామని ముడా అంగీకరించిందని చెప్పారు. ఇదంతా బీజేపీ అధికారంలో ఉ న్నప్పుడే జరిగింది అన్నారు. ఇందులో తప్పేముందని ప్రశ్నించారు. భూముల కేటాయింపుల్లో 50:50 ఫార్ములాను బీజేపీనే ప్రతిపాదించిందని చెప్పారు.

## రుణమాఫీ కోసం సర్కార్ కసరత్తు

హైదరాబాద్,జూలై 10: రైతు రుణమాఫీ పథకానికి నిధుల కోసం నానా తంటాలు పడుతున్నట్లు తెలుస్తోంది. నిధుల సమీకరణ ప్రస్తు తసమయంలో చాల కష్టమైన పనిగా మారింది. గత కెసిఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి గుదిబండగా మారింది. ఈ క్రమంలె రుణమాఫీ కష్టమైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం అనేక మార్గాల్లో కసరత్తు చేస్తోంది. ఆగస్టు 15లోగా రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిధుల సేకరణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ముఖ్యంగా ప్రతి నెలా తీసుకుంటున్న రుణాలను జాగ్రత్తగా ఖర్చు చేస్తూ, పాత అప్పుల కిస్తీలు కడుతూ ఎంతో కొంత నిధులను ఆదా చేస్తూ వచ్చింది. రాష్ట్ర ఖజానాకు వివిధ మార్గాల ద్వారా వస్తున్న ఆదాయం లోనూ కొంత మిగులుబాటు అయ్యేలా చూస్తోంది. రైతు రుణమాఫీ పథకం అమలుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. అందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటోంది. ముఖ్యంగా నిధుల సేకరణకు రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే పలు మార్గాలను ఆలోచించి పెట్టుకుంది. వీటిపై కసరత్తు చేయాల్సిం దిగా ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించింది. అదేసమయంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీ స్థాయిలోనూ ప్రయత్నాలు చేస్తున్నారు.మార్కెట్ నుంచి సేకరించే బడ్జెట్ అప్పులను జూలై, ఆగస్టు నెలల్లో ఎక్కువ మొత్తంలో తీసుకునేం దుకు అవకాశం కల్పించాలని కేంద్రాన్ని కోరుతూనే.. భూములను హామీగా పెట్టి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి తీసుకోవద్దంటూ విజ్ఞప్తి చేస్తోంది. మరోవైపు నెలవారీగా తీసుకుంటున్న బడ్జెట్ రుణాలను ఖజానాలో జమ చేసి పెడుతోంది. ఇప్పటికే రుణమాఫీ పథకం కోసం రూ.10 వేల కోట్ల వరకు ఖజానాలో నిల్వ చేసినట్లు సమాచారం. వాస్తవానికి రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది ప్రాథమికంగా అంచనా వేసిన మొత్తం. పథకాన్ని పూర్తిగా అమలు చేసేనాటికి నిధుల మొత్తం తగ్గవచ్చన్న అభిప్రాయాలున్నాయి. ఏదేమైనాఈ ఆర్థిక సంవత్సరం లో ప్రభుత్వం ఏప్రిల్‌లో రూ.4000 కోట్లు, మేలో 4000 కోట్లు, జూన్‌లో 5000 కోట్ల చొప్పున మార్కెట్ రుణాలను సేకరించింది. జూలై, ఆగస్టు నెలల్లో తీసుకునే మార్కెట్ రుణాల్లో కొన్ని నిధులను రుణమాఫీ పథకానికి మళ్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూలైలో రూ.6,500 కోట్లు, ఆగస్టులో రూ.5000 కోట్ల మేర రుణం తీసుకోవాలని ముందస్తు ప్రణాళికను నిర్దేశిరచుకుంది. ఆ 11,500 కోట్లలో ప్రభుత్వ వ్యయాలు, పాత అప్పుల కిస్తీలు పోను ఎంతో కొంత ఆదా చేయనుంది. ఈ రెండు నెలల రుణాల్లో ఇప్పటికే రూ.2000 కోట్లు తీసుకున్నందున మిగతా రూ.9,500 కోట్లలో ఒకేసారి ఎక్కువ మొత్తాన్ని తీసుకోవడానికి అనుమతి ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది.



ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. కేంద్రం అనుమతించి, ఒకేసారి పెద్ద మొత్తంలో రుణం తీసుకుంటే ఎక్కువ భాగాన్ని రుణమాఫీ పథకానికి మళ్లించాలని సర్కారు యోచిస్తోంది. రుణమాఫీ పథకంతో పాటు ఇతర వ్యయాల కోసం ప్రభుత్వం పలు రకాలుగా నిధుల సేకరణ ప్రయత్నాలు చేస్తోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములను ప్రైవేటు బ్యాంకుల వద్ద హామీగా పెట్టి రుణాలు తీసుకోవడంపై కసరత్తు చేస్తోంది. కానీ, ఇలాంటి రుణాలపై కొన్ని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రుణాలను కూడా ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోనే లెక్కిస్తామంటూ కేంద్ర ప్రభుత్వం భీష్మిస్తే ఇబ్బంది తప్పదన్న అభిప్రాయాలున్నాయి. ఇలాంటి రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి తీసుకోవద్దంటూ సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రధాని, ఆర్థిక మంత్రిని కోరారు. దీనికి కేంద్రం ఆమోదం తెలపాల్సి ఉంది. మరోవైపు పరిశ్రమలకు కేటాయించిన భూములను వాణిజ్య, నివాస అవసరాల కోసం మార్పిడి చేయాలన్న ఆలోచన కూడా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో చాలా భూములను పారిశ్రామిక యూనిట్లకు కేటాయించారు. కానీ, కొన్నింటిలో ఎలాంటి యూనిట్లు ఏర్పాటు కాలేదని, ఆర్థిక, పారిశ్రామిక ఉత్పత్తి కార్యకలాపాలను ప్రారంభించలేదని ప్రభుత్వం గుర్తించింది. అలాంటి భూములను నివాసయోగ్య స్థలాలుగా మార్చి, విక్రయించే ఆలోచన చేస్తోంది. ఇలా వచ్చే నిధులను రుణమాఫీ పథకానికి మళ్లించడంతో పాటు రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలకు వినియోగించాలన్న ఆలోచనలో ఉంది.అందుకే రుణమాఫీని 3 దశలుగా అమలు చేయాలని యోచిస్తోంది. ముందుగా రూ.లక్ష లోపు రుణాలను, తర్వాత రూ.లక్షన్నర లోపు, అనంతరం రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేయాలని భావిస్తోంది.

## సంపాదకీయం

**గురువారం 11-07-2024**

# ఎంతకాలమిా ప్రజా వంచన !

వికసిత భారత్ పేరుతో ఇక ఎంతోకాలం అద్భుత ప్రసంగాలనే చేయలేం. రష్యా పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ అక్కడా.. భారత్ వెలిగిపోతోందని మాట్లాడారు. బ్రహ్మాండగా అభివృద్ధి చెందిందని, ప్రపంచంతో పోటీ పడుతోందని చెప్పారు. ఆర్థికంగా ఎదిగిందని అన్నారు. అనేక రంగాల్లో ముఖ్యంగా రైల్వే, విద్యుత్ రంగాల్లో అద్భుత ప్రగతిని సాధించామని అన్నారు. నిజంగానే అభివృద్ధి చెందితే ప్రజల బతుకులు ఎందుకు దౌర్భాగ్యంగా ఉన్నాయో తెలుసుకోలేకపోతున్నారు. రూపాయి ఎందుకు బలహీనపడుతుందో చెప్పడం లేదు. నిరుద్యోగుల ఆక్రందనలు ఎందుకు పట్టించుకోవడం లేదు. ధరలు అందకుండా పోతున్నా ఎందుకు చర్యలు కోవడం లేదు. ఇవన్నీ దాచి భారత్ పరుగులు పెడుతుందని, అభివృద్ధితో దూసుకుపోతుందని ఎలా చెప్పగలుగుతున్నారు. సొంత డబ్బా కొట్టుకోవడంతోనే అమృత కాలం సాగుతోంది. ప్రజలు సజావుగా.. సక్రమంగా బతకడానికి అవసరమైన పరిస్థితులు ఉంటేనే ప్రజలు అమృతకాలం గొప్పదని భావిస్తారు. కాలం మంచిగా ఉండాలంటే పాలకుల్లో చిత్తశుద్ధి ఉండాలి. ప్రజలకు మేలు చేయాలన్న తపనా ఉండాలి. ప్రజలకు బతుకుపై భరోసా కల్పించేలా పాలకుల విధానాలు కూడా ముఖ్యం. ఇవన్నీ ఉంటే ప్రజలు మరింత కష్టపడ గలరు. దేశ అర్థిక పురోభివృద్దిలో తమ చెమటను రంగరించగలరు. ముందుగా ఈ దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగిపోవాలి. కులాలకతీతంగా అభివృద్ధి సాగాలి. కులాల ఆధారంగా పేదరికాన్ని నిర్ధారించ లేమని గుర్తించాలి. కులగణన అంటున్న వారు...భారత్‌ను విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలను పటిష్ఠం చేస్తున్నారని భావించాలి. ఈ విషయంలో ప్రజల్లో చైతన్యం తీసుకుని రావాలి. కులమతాలు అవసరం లేదంటున్న రాజకీయ నాయకులు ఈ విషయంలో ద్వంద్వ నీతిని పక్కన పెట్టాలి. ఒకేదేశంలో ఒకే చట్టం ఉండాలి. అది ఎవరికైనా ఒకే విధంగా ఉండాలని కోరుకోవాలి. ఆధునిక ప్రజాస్వామ్యంలో ప్రజలందరికీ ఉమ్మడి పౌరస్మృతి ఉండడం వాంఛనీయమే. సమాజంలో ఏ వర్గమైనా ఇవాళ వెనకబడి ఉండడానికి, కొద్ది మంది చేతుల్లో సంపద కేంద్రీకృతం కావడమే కారణంగా చూడాలి. ఈ అసమనాతలను తొలగించేలా పాలనా పరమైన చర్యలు తీసుకోవాలి. 50 శాతం సంపద కేవలం మూడు శాతం జనాభా చేతుల్లో ఉండడం వల్ల పేదలు మరింత పేదులగా మారారు. అత్యధిక జనాభా రెండుపూటల భోజనం చేయలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నదని గుర్తించడం లేదు. అన్నధాన్యాలు పండుతున్నా పస్తులు ఉండాల్సిన ఖర్మ పడుతోంది. పేదరికం, అత్యాచారాలు, అవమానాలు, అణిచివేత ఈ దేశంలో సర్వసాధారణ విషయాలుగా మారయి. ఈ దేశంలో నిరుపేదలైన ఆదివాసులు చిన్నచిన్న నేరాలపై ఏళ్లతరబడి బెయిలు లేకుండా జైళ్లలో మగ్గుతున్నారు. ప్రధాని మోదీ పదేపదే మరో పాతిక సంవత్సరాల అమృత కాలంలో తీసుకోవాల్సిన చర్యల గురించి మాట్లాడుతున్నారు. ఇప్పుడు వికసిత భారత్ అంటూ కొత్త నినాదాం ఎత్తుకున్నారు. దేశం ఎలా ఉండాలో చెబుతున్నారు. తీసుకుంటున్న చర్యలు ఎలా సాకారం కాబోతున్నాయో చెబుతున్నారు. కానీ దానికన్నా ముఖ్యం ప్రజలు ఈ దేశంలో స్వేచ్ఛగా బతకగలిగేలా పరిస్థితులు రావాలి. బతుకుతామన్న ధీమా కూడా ముఖ్యమే. ఉద్యోగం లేదా ఉపాధి ఎంచుకుని బతుకుతామన్న భరోసాకు తగ్గట్లుగా పరిస్థితులు కల్పించాలి. ధరలను అదుపు చేయగలగాలి. ప్రధానమంత్రిగా మోడీ ఈ దేశంలో సామాజిక, ఆర్థిక, లైంగిక, చట్టపరమైన అసమానతలపై మాట్లాడడంలో తప్పు లేదు. కానీ సామాన్యులు వీటిని పాటిస్తూనే.. బతకు దెరువు ఎలా అన్న బెంగలో ఉండరాదు. ఇకపోతే ఇవన్నీ చిత్తశుద్ధిగా అమలు చేస్తూ..ప్రజల్లో విశ్వాసం కలిగిస్తే..పాలకులను వారే అక్కున చేర్చుకుంటారు. ప్రజల మద్దతు పొందేందుకు అప్పుడు ఎత్తులు జిత్తులు వేయాల్సిన అవసరం లేదు. తగిన అభివృద్ధి విధానాలను కొనసాగిస్తే తద్వారా ప్రజలను ఆకర్షించి విస్తరించగలిగిన శక్తి దానతంతట అదే సమకూరుతుంది. అప్పుడు అధికారం కోసం ఎలాంటి అనారోగ్య కరమైన చర్యలకు పాల్పడాల్సిన అవసరం ఉండదు. దేశంలో అవినీతికి, కుంభకోణాలకు పాల్పడుతున్న శక్తుల్నీ ఏకమవుతు న్నాయని విరుచుకుపడిన మోదీ, వారి భరతం పట్టడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారన్నదే అనుమానం. కాళేశ్వరంలో అవినీతి జరిగితే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. జగన్, కెసిఆర్‌ల అవినీతి గురించి పదేపదే మాట్లాడుతున్న బిజెపి నేతలు ఒక్క చిన్న చర్య కూడా తీసుకోలేక పోయారు.ప్రజల్లో విశ్వాసం కల్పించే బదులు రాజకీయ అవకాశ వాదం అవలంబిస్తూ వస్తున్నారు.పార్టీలను చీల్చడం, తమకు అనుకూలంగ ఆప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవడం మోడీ దృష్టిలో అభివృద్ధి అవుతుందేమో. కేవలం ప్రతిపక్షాలపై మాత్రమే అవినీతి ఆరోపణలు చేస్తే ప్రజలు ఎలా విశ్వసిస్తారన్నది కూడా గమనించాలి. అవినీతిపరులపై చర్యలు తీసుకుంటామన్న మోదీ ఉపన్యాసాలకు విలువ లేదని కూడా తేలిపోయింది. మోదీ హయాంలో బీజేపీ సైద్ధాంతిక విలువలకు తిలోదకాలు ఇచ్చింది. ఇతర పార్టీలతో పోలిస్తే బీజేపీ ఒక విశిష్టమైన పార్టీ అని చెప్పుకోలేని దుస్థితిలో ఏర్పడింది. ఎన్నికల్లో గెలిచేందుకు ఎటువంటి దుష్కార్యాల కైనా వెనకాడదని నిరూపించుకుంటోది. ప్రతిపక్షాల ఐక్యతను దెబ్బతీయడం, కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలో పడవేయడం అన్న సూత్రాల ఆధారంగానే పాలన సాగుతోంది తప్ప ..ప్రజలకు మంచి చేయడం ద్వారా పాలన సాగడం లేదని గ్రహించాలి. ప్రధాని మోడీ చెప్పినట్లు దేశం పురోగమించిందటే ఉఆధి పెరగాలి. ఉద్యోగాల కల్పనా జరగాలి. అవినీతి నేతలను బొక్కలో తోయాలి. ఇవేవీ జరగడం లేదంటే.. మోడీ మాటల్లో నిజం లేదని గుర్తించాలి. ఇదే వికసిత భారత్ అనుకుంటే చేసేదేమీ లేదు.

# మంచి పరిణామం...



న్యూఢిల్లీ,నాలుగు రోజుల వ్యవధిలో వెలువడిన రెండు కీలకమైన ఎన్నికల ఫలితాలు నయా ఉదారవాద, నియో ఫాసిస్టుశక్తులను ఓడించడం సాధ్యమేనని నిరూపించారు. ఫ్రాన్స్‌లో లేదనుకున్న మెరిన్ లీపెన్ ఎదురు ఎదురుని ఫాసిస్టు నేషనల్ ర్యాలీ పార్టీ, దాని మిత్రులను ఓడించి అతిపెద్ద కూటమిగా లెఫ్ట్ పార్టీ సంచలన విజయం సాధించడం, బ్రిటన్‌లో టోరీల పద్దేళ్ల ముదనష్టపు పాలనకు అక్కడి ప్రజలు చరమగీతం పాడడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఈ రెండు తీర్పులు ప్రపంచవ్యాప్తంగా జాతీయహంకార, నయా ఉదారవాద విధానాలపై పోరాడుతున్న శక్తులకు ప్రేరణనిచ్చేవే. ఫ్రాన్స్‌లో వామపక్ష, ప్రగతి శక్తులతో కూడిన న్యూ పాపులర్ ఫ్రంట్ సాధించిన విజయం ఎంతైనా కొనియాడదగినది.రెండున్నర శతాబ్దాల క్రితమే 'స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం' నినాదం ప్రపంచానికి సమానమైన ఫ్రెంచి విప్లవ వారసత్వాన్ని, నాటి హిట్లర్ ఫాసిజాన్ని తిప్పికొట్టిన నాటి పాపులర్ ఫ్రంట్ తరహాలో ఏర్పాటైన న్యూ పాపులర్ ఫ్రంట్ మూడు వారాల్లోనే సంచలనం సృష్టించింది. మొదటి రౌండ్‌లో మూడింట రెండొంతుల ఓట్లతో మొదటి స్థానంలో ఉన్న లీపెన్ పార్టీ (నేషనల్ ర్యాలీ) ఫాసిస్టు కూటమిని రెండో రౌండ్ తర్వాత మూడవ స్థానంలోకి నెట్టేసి, అగ్రస్థానాన్ని చేజిక్కించుకున్న చిన్న విషయమేమీ కాదు. నెల రోజుల క్రితం జరిగిన యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికల్లో ర్యాలీ పార్టీ 31.5 శాతం ఓట్లతో పెద్ద ప్రాంతీయ శక్తిగా అవతరించడంతో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ జాతీయ అసెంబ్లీని రద్దు చేసి, మధ్యంతర ఎన్నికలను ప్రకటించారు. జూన్ 30న 'సింగిల్ కానిస్టిట్యుయెన్సీ డైరక్ట్ ఎలక్షన్' పద్ధతిలో జరిగిన మొదటి రౌండ్ ఎన్నికల్లో 76 మంది అభ్యర్థులు గెలవగా, జులై 7న రెండో రౌండ్‌లో 501 స్థానాలకు పోలింగ్ జరిగింది. 577 స్థానాలున్న ఫ్రాన్స్ పార్లమెంటులో సాధారణ మెజార్టీకి అవసరమైన 289 స్థానాలు ఏ కూటమికీ అందుబాటులోకి వచ్చాయి. ఫ్రెంచ్ రాజ్యాంగం ప్రకారం ఏకైక అతిపెద్ద కూటమిగా ఉన్న న్యూ పాపులర్ ఫ్రంట్‌నే ప్రభుత్వ ఏర్పాటుకు అధ్యక్షుడు మొదట ఆహ్వానించాలి. సోషలిస్టులు, కమ్యూనిస్టులు, గ్రీన్‌పార్టీ, ఫ్రాన్స్ అన్‌బౌడ్ పార్టీలతో కూడిన న్యూపాపులర్ ఫ్రంట్ దేశానికి ఫాసిస్టుల నుంచి ఎదురవుతున్న ముప్పును గుర్తించడం సరైన సమయంలో సరైన వ్యూహం, రాజకీయ ఎత్తుగడలతో లీపెన్ పార్టీని అధికారానికి ఆమడ దూరంలో ఉంచింది. అలా అని లీపెన్ పార్టీ ప్రమాదం తొలగిపోలేదు. పార్టీల వారిగా చూస్తే ఓట్లలోను సీట్లలోనూ అతిపెద్ద పార్టీగా నేషనల్ ర్యాలీ ఉన్నది.మొదటి రౌండ్‌లో ఫలితాలను చూశాక ఫాసిస్టు పార్టీని ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారంలోకి రానీయకుండా చూడాలన్న దృఢ సంకల్పంతో న్యూ పాపులర్ ఫ్రంట్ రాజకీయ ఎత్తుగడల్లో మార్పు చేసింది. ఫాసిస్టు వ్యతిరేక ఓట్లలో చీలికను నివారించాలన్న ఉద్దేశంతో తాను గెలిచే అవకాశాలు తక్కువగా ఉన్న 200 నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఉపసంహరించుకుంది. ఇది మాక్రాన్ వ్యతిరేకని రినైజాన్స్ కూటమికి కొంత లాభించినా, ఫాసిస్టు శక్తులను ఒంటరిపాటు చేయడానికి ఇది దోహదపడింది. ఈ వాస్తవాన్ని మాక్రాన్ పార్టీ గుర్తెరిగి వ్యవహరించాలి. అది అనుసరించిన నయా ఉదారవాద విధానాలే పచ్చి మితవాద శక్తులకు ఇంతగా ఊతమిచ్చాయి. 2019లో వచ్చిన ఎల్లో వెస్ట్ ఉద్యమం, రిటైర్‌మెంట్ వయస్సు 64 ఏళ్లకు పెంచడం, పెన్షన్లలో కోత, విపరీతంగా పెరిగిన జీవన వ్యయం, ఆర్థిక వ్యయం కావడం, చివరికి నిరుద్యోగ భృతిని తిరస్కరిస్తూ ప్రకటించడం.వంటి చర్యలు మాక్యూడా పార్టీ పట్ల తీవ్ర వ్యతిరేకతను, అసంతృప్తిని రేకెత్తించాయి. తొలి రౌండ్ ఫలితాలతో నిరుద్యోగ భృతి తిరస్కరణ కారణంగా పక్కనపెట్టడం లాంటి చర్యలు తీసుకోవడం మాక్రాన్ పార్టీ రెండో స్థానంలోకి రావడానికైనా దోహదపడింది. వామపక్షాల సంకీర్ణం ఏర్పడాలన్న ఫ్రాన్స్ ప్రజల అభిమతాన్ని నెరవేర్చాల్సిన బాధ్యతను నెరవేర్చాల్సి ఉంది.బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో లేబర్ పార్టీకి మూడింట రెండొంతుల మెజారిటీతో సాధించిన విజయం ఆ పార్టీ గొప్పతనం అనే దాని కన్నా టోరీలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతే ఈ తీర్పులో ఎక్కువగా ప్రతిబింబిస్తుంది. కీర్ స్టార్‌మర్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. 14 ఏళ్ల పాలనలో దూకుడుగా అనుసరించిన నయా ఉదారవాద విధానాలతో కన్జర్వేటివ్ పార్టీ (టోరీ) చరిత్రలోనే అతిఘోర ఓటమిని మూటగట్టుకుంది. 650 స్థానాలున్న సభలో 412 స్థానాలు సాధించా, లేబర్ పార్టీకి వచ్చిన ఓట్లు 33.8 శాతమే. ఐదేళ్ల క్రితం కంటే పెరిగినవి రెండు శాతమే. లేబర్ పార్టీలో వామపక్ష భావాలున్న నేత జెరెమీ కార్బిన్ నాయకత్వంలో 2017లో 40 శాతం ఓట్లకు చేరువ కాలేదన్నది వాస్తవం. ఇజ్రాయిల్‌పై మెతక వైఖరిని వ్యతిరేకిస్తూ కార్బిన్‌తోపాటు లేబర్ పార్టీ నుంచి విడిపోయి స్వతంత్రంగా పోటీ చేసిన ఐదుగురు అభ్యుదయవాదులు, సామ్రాజ్యవాద వ్యతిరేకులు గెలుపొందడం సానుకూల అంశం. పచ్చి మితవాది, అల్ట్రా రైట్ వింగ్ నాయకుడు నిగెల్ పరాజ్ ప్రత్యామ్నాయాన్ని యుకె రిఫార్మ్ పార్టీ నాలుగు స్థానాలే గెలుచుకున్నా, గత ఎన్నికల్లో 1.7 శాతంగా ఉన్న ఓట్లను ఈ ఎన్నికల్లో 14 శాతం పెంచుకోవడం ఆందోళనకరం.బ్రెగ్జిట్, ఆరోగ్యం, విద్యా రంగాల్లో తీవ్ర వైఫల్యం, పార్టీగేట్, పోస్టాఫీస్ తదితర వరుస కుంభకోణాలతో గత నెల రోజుల వ్యవధిలోనే బ్రిటన్ ప్రధాని పీఠం నుంచి బోరిస్ జాన్సన్, లిజ్ ట్రస్ వైదొలగాల్సి వచ్చింది. ఆ తరువాత 20 నెలలపాటు ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన భారత సంతతికి చెందిన రిషి సునాక్ ఆమోదం కన్జర్వేటివ్ 121 స్థానాలకే పరిమితమైంది. బడా గుర్తింపుల మీద, సంపన్న వర్గాల మీద అదనపు పన్నులు వేస్తామని, శ్రామిక వర్గాలకు సంపద చేరేలా, దేశాన్ని పునర్నిర్మిస్తామని ఇక్కడి లేబర్ పార్టీ, ఫ్రాన్స్‌లోని లెఫ్ట్ కూటమి ప్రకటించాయి. స్టార్‌మర్ ప్రకటనని లేబర్ పార్టీ ప్రజల ఆకాంక్షలకనుగుణంగా నయా ఉదారవాద విధానాలను విడనాడి ప్రజానుకూల విధానాలను అవలంభించాలి. లేకుంటే శ్రమజీవుల నుంచి ప్రతిఘటన తప్పదు.

# ప్రజలను దోచుకుంటున్న జియో,ఎయిర్‌టెల్




హైదరాబాద్,జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు సెల్ రీచార్జీలను భారీగా పెంచాయి. జియో 12 నుంచి 25 శాతం పెంచితే, ఎయిర్ టెల్ 11 నుంచి 21 శాతం పెరిగింది. ఈ పెంపుదలలతో జియో, ఎయిర్ టెల్ కంపెనీల లాభాలు రూ.20 వేల కోట్లకు పెరుగుతాయని మీడియా చెపుతోంది.మరోవైపు, ఈ చార్జీల పెంపుదల ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశన్నంటాయి. ఒక్కొక్క వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయం పెరుగుదల (యావరేజి రెవిన్యూ పర్ యూజర్) కోసం ఈ పెంపుదలను చేశామని టెలికం కంపెనీలు సమర్థించుకుంటున్నాయి. ఇది పూర్తిగా తప్పుదోవ పట్టించే ప్రకటన. ప్రయివేటు టెలికం కంపెనీలు ఇంత భారీగా చార్జీల ధరలు పెంచడానికి గల కారణం కనపడటం లేదు. జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు ఇప్పటికే అత్యధిక లాభాలు దండుకున్నాయనేది కాదనలేని సత్యం. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జియో రూ.20,607 కోట్లు నికర లాభం సంపాదించింది. ఇదే ఆర్థిక సంవత్సరంలో ఎయిర్ టెల్ రూ.7467 కోట్లు నికరలాభం సంపాదించింది. అందుచేత, సామాన్య ప్రజల పిండి వసూలు చేస్తే ఈ చార్జీల పెంపుదల బొత్తిగా అనవసరం. టెలికం రంగంలో ట్రారు నియంత్రణ సంస్థ ఉంది. లాభ దాహార్తితో పనిచేసే ప్రయివేట్ టెలికం కంపెనీలు ప్రజలను దోచుకోకుండా చూడటం కూడా ఈ ట్రారు విధుల్లో ఒకటి. అయితే, ఆచరణలో ఈ ట్రారు ప్రయివేట్ టెలికం కంపెనీల ప్రయోజనాల కోసమే పని చేస్తోంది. 2016లో జియో తన సేవలను ప్రారంభించినప్పుడు నియంత్రణాసంస్థ నిబంధనలను జియో అతిక్రమించింది. అప్పుడు ట్రారు మూగజీవిలా చూస్తూ ఉండిపోయింది. ఆ సమయంలో జె.ఎస్ దీపక్ అనే సీనియర్ అధికారి టెలికం డిపార్ట్‌మెంట్ కార్యదర్శిగా ఉన్నారు. ఇతను జియో చేసిన తీవ్ర ఉల్లంఘనలపట్ల అభ్యంతరాలు లేవనెత్తుతూ, జియోపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ట్రారుకి లేఖ రాశారు. ట్రారు ఎటువంటి చర్యను తీసుకోలేదు సరికదా, మోడీ ప్రభుత్వం టెలికం డిపార్ట్‌మెంట్ నుండి జెఎస్ దీపక్‌ని రాత్రికి రాత్రే బయటకు నెట్టింది. ఇటువంటి పరిస్థితుల్లో, బిఎస్‌ఎన్‌ఎల్ సంస్థ మాత్రమే టెలికం రంగంలో నిజమైన నియంత్రణగా పనిచేసింది. బిఎస్‌ఎన్‌ఎల్ నుంచి ఉన్న తీవ్ర పోటీ కారణంగా తమ ఇష్టానుసారం టారిఫ్ చార్జీలను పెంచలేకపోయాయి. ఈ పరిస్థితి ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. ఏమైనా, ఈరోజు దాకా బిఎస్‌ఎన్‌ఎల్ 4జి, 5జి సేవలను ప్రారంభించలేక పోయింది. దీని ఫలితంగా ప్రవేటు కంపెనీలతో సమాన స్థాయిలో పోటీ పడటానికి అవరోధం ఏర్పడింది.బిఎస్‌ఎన్‌ఎల్‌లో 4జి, 5జి సేవలు అందుబాటులో లేనందున బిఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులు హైస్పీడ్ డేటా సేవలు పొందే అవకాశం కోల్పోతోంది. దీనితో తప్పనిసరై, వినియోగ దారులు పెద్ద సంఖ్యలో బిఎస్‌ఎన్‌ఎల్‌ను వదిలి, జియో, ఎయిర్‌టెల్ వైపు మరలుతున్నారు. ట్రారు విడుదల చేసిన లెక్కల ప్రకారం, 2023–24 ఒక ఏడాదిలోనే బిఎస్‌ఎన్‌ఎల్ భారీ స్థాయిలో 1.8 కోట్ల మంది వినియోగదారులను పోగొట్టుకుంది. 2024 మార్చి ఒక్క నెలలోనే 23.54 లక్షల మంది వినియోగదారులు బిఎస్‌ఎన్‌ఎల్ వదిలి వెళ్లారు. అదే నెలలో రిలయన్స్ జియో 21.43 లక్షల మంది కొత్త ఇల్లు, ఎయిర్ టెల్ 17.5 లక్షలమంది కొత్త వినియోగాన్ని పొందగలిగారు. ఈన్నీ అభివృద్ధి జియో, ఎయిర్ టెల్ భారీగా టారిఫ్ చార్జీలు పెంచడానికి ప్రోత్సహించాయి. బిఎస్‌ఎన్‌ఎల్ ఇప్పటిదాకా 4జి, 5జి సేవలను ఎందుకు ప్రారంభించలేక పోయింది? ఎందువలనంటే మోడీ ప్రభుత్వం బిఎస్‌ఎన్‌ఎల్‌కు రెండు ప్రతిబంధకాలు కల్పించింది. ఒకటి: 2019లో బిఎస్‌ఎన్‌ఎల్‌కు అప్పుడు 3జి నెట్‌వర్క్‌ను 4జి నెట్‌వర్క్‌గా అప్‌డేట్ చేయడానికి అనుమతించలేదు. రెండు: తిరిగి 2020లో రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్‌లతో విదేశీ అమ్మకందారుల నుంచి ప్రామాణికమైన 4జి పరికరాలను బిఎస్‌ఎన్‌ఎల్ కొనుగోలు చేయడాన్ని నిషేధించారు. భారతదేశ పరికరాల తయారీదారుల నుండి మాత్రమే 4జి పరికరాలు బిఎస్‌ఎన్‌ఎల్ కొనవలసిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. 2023 మే నెలలో, మాజీ సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఇక కొద్ది వారాలలో బిఎస్‌ఎన్‌ఎల్ 4జి సేవలు ప్రారంభమవుతాయని, అదే ఏడాది నవంబరు లేక డిసెంబర్ నాటికల్లా ఈ సేవనే 5జికి అప్‌లోడ్ చేయబడిన గొప్ప విశేషాలు చెప్పారు. అయితే, బిఎస్‌ఎన్‌ఎల్ కనీసం 4జిలకు కూడా ఈనాటికి కూడా ప్రారంభించలేక పోయింది. ఈ కారణాలన్నిటిని దృష్టిలో పెట్టుకొని బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ (బిఎస్‌ఎన్‌ఎల్‌ఐయు), బిఎస్‌ఎన్‌ఎల్ తన కస్టమర్‌లకు 4జి సేవలను అందించడానికి వోడాఫోన్ ఐడియా నెట్‌వర్క్‌ను వాడుకోవడానికి అనుమతివ్వమని డిమాండ్ చేసింది. వోడాఫోన్ ఐడియాలో ప్రభుత్వమే అతిపెద్ద వాటాదారుగా ఉన్నప్పుడు, ఈ ప్రతిపాదనను తేలికగా అమలులో పెట్టవచ్చు. కానీ అలా జరగలేదు. బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఈ డిమాండ్‌ను అమలులో పెట్టమని దేశవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి. జియో, ఎయిర్ టెల్ తమ చార్జీలను భారీగా పెంచిన సందర్భంలో బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, బిఎస్‌ఎన్‌ఎల్ తక్షణమే 4జి సేవలను ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు, దానిని త్వరగా 5జిగా అప్‌డేట్ చేసిన సమాచార శాఖ మంత్రికి మరోసారి లేఖ రాసింది. 4జి, 5జి సేవలు ప్రారంభిస్తే సామాన్య ప్రజానీకానికి హైస్పీడ్ డాటా సేవలను, తక్కువ టారిఫ్ చార్జీలతో బిఎస్‌ఎన్‌ఎల్ అందించగలుగుతుంది.

## 20వేలు లంచం తీసుకున్న పంచాయితీ కార్యదర్శి

జనగామ, పంచాయితీల్లో చేసిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో రూ. 20 వేలు లంచం తీసుకున్న పంచాయతీ కార్యదర్శిని అవినీతి నిరోధకశాఖ అధికారులు పట్టుకున్నారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ భర్త గవ్వాని నాగేశ్వరరావు గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేశారు. ఇందుకు సంబంధించిన బిల్లుల చెల్లింపు విషయంలో పంచాయతీ కార్యదర్శి పగిడే శివాజీని సంప్రదించాడు. రూ. 20 వేలు ఇస్తే బిల్లులు ఇస్తానని మొండికేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో బాధితుడి నుంచి రూ.20 వేలు తీసుకోగా అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు తనిఖీ చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. లంచం తీసుకున్న పంచాయతీ కార్యదర్శిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు తెలిపారు.

# నకిలీ కంపెనీలు సృష్టించి మోసం

వాషింగ్టన్,అమెరికాలో నలుగురు తెలుగువాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. నకిలీ కంపెనీలు సృష్టించి కొంతమందితో బలవంతంగా పని చేయించుకుంటున్నట్లు గుర్తించారు. ఇప్పటికే ఇద్దరు కంపెనీ మోసాల్లో ఇద్దరు భారతీయ సంతతికి చెందిన అమెరికన్లకు జైలు శిక్ష వేశారు. తాజాగా ఇప్పుడీ ఘటన చోటు చేసుకుంది. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల్లో దాదాపు 100 మందికి పైగా నకిలీ కంపెనీల్లో పనిచేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. పోలీసుల సోదాల్లో ఒకే ఇంట్లో 15 మందిని గుర్తించడం గమనార్హం.ప్రిన్స్‌టన్ పోలీసుల వివరాల ప్రకారం.. గిన్స్‌బర్గ్ లేన్‌లోని ఓ ఇంట్లో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం అందింది. 2024 మార్చి 13న ప్రిన్స్‌టన్ పోలీసు సీఐడీ విభాగం సంతోష్ కట్కూరి ఇంట్లో సోదాలు జరిపింది. మొత్తం 15 మంది యువతులతో ఆయన భార్య ద్వారక పని చేయిస్తున్నట్లు తేలింది. వీరంతా బలవంతంగా పని చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. వారినుంచి ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, ప్రింటర్లు సహా పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత జరిపిన దర్యాప్తులో ప్రిన్స్‌టన్, మెలిసా, మెకెన్నీ ప్రాంతాల్లోనూ బాధితులను గుర్తించారు. ఎలక్ట్రానిక్స్ పరికరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన పోలీసులు.. అక్రమంగా కంపెనీలు నెలకొల్పి కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు తేల్చారు. సంతోష్, ద్వారకతో పాటు చందన్ దాసిరెడ్డి, అనిల్ మాలె సైతం వీరికి సహకరించినట్లు తెలిసింది. ఈ నలుగురిపైనా అరెస్ట్ వారెంట్ జారీ చేసింది.గిన్స్‌బర్గ్ ప్రాంతంలో పనిచేసే ఓ శ్రామికుడు అపార్ట్‌మెంట్‌లో చాలామంది పని చేస్తుండడం గమనించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వటంతో విషయం వెలుగులోకి వచ్చింది. అక్కడ పనిచేసే వారిని ప్రశ్నించగా.. డాలస్ కేంద్రంగా పనిచేస్తున్న ఓ భారత ఏజెన్సీలో నలుగురు వ్యక్తులు తమతో బలవంతంగా పని చేయించుకుంటున్నారని వెల్లడించారు.

## పాత్రలో జీవించడం గుమ్మడి ప్రత్యేకత

గుంటూరు,చిన్న వయసులోనే బరువైన పాత్రలు పోషించిన గనాపాటి దివంగత గుమ్మడి వెంకటేశ్వర రావు. మెథడ్ యాక్టింగ్కి మీనింగ్ తెలిసేలా చేశారు. పాజిటివ్, నెగిటివ్ క్యారెక్టర్ ఏదైనా అందులో జీవించాల్సిందే. లీడ్ రోల్ అయినా అతిథి పాత్రైనా.. ఆ సినిమాపై తనదైన ముద్ర వేయాల్సిందే. అదే గుమ్మడి వెంకటేశ్వర రావు ప్రత్యేకత. ఏ పాత్ర అయినా అలవోకగా చేసే గుమ్మడి నటన అందరికీ గుర్తుండిపోయింది. గుమ్మడి జయంతి సందర్భంగా ఆయనను ఓసారి గుర్తు చేసుకోవడం అవసరం. గుమ్మడి వెంకటేశ్వరరావు 1927 జూలై 9న గుంటూరు జిల్లా తెనాలి తాలూకా రావికంపాడు గ్రామంలో ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. గుమ్మడి వెంకటేశ్వరరావుకు బాల్యం నుంచీ ఏదో ఒక వైవిధ్యం ప్రదర్శించాలనే తపన ఉండేది.యన్టీఆర్ తమ ఎన్.ఏ.టి. సంస్థ నిర్మించిన చిత్రాలలో మంచి పాత్రలు ఇచ్చి ప్రోత్సహించారు. అలా రామారావు సొంత చిత్రాలు ? 'పిచ్చి పుల్లయ్య, తోడుదొంగలు, జయసింహ' లో గుమ్మడి కీలక పాత్రలు పోషించారు. ఆ తరువాత గుమ్మడి మరి వెనుదిరిగి చూసుకోలేదు. 'తోడుదొంగలు'లో గుమ్మడి వయసు మీరిన పాత్ర ధరించడం చూసిన పి.పుల్లయ్య తన 'అర్ధాంగి' చిత్రంలో ఏయన్నార్, జగ్గయ్యకు తండ్రిగా నటించే పాత్రను ఇచ్చారు. తన కన్నా వయసులో పెద్దవారయిన నటులకు తండ్రిగా నటించడంతో అప్పటి నుంచీ గుమ్మడికి అధికంగా తండ్రి పాత్రలే పలకరించసాగాయి. ఒకే రకం పాత్రలు ధరించినా, వాటిలో తనదైన బాణీ ప్రదర్శించడానికి గుమ్మడి ప్రయత్నించేవారు.అనేక విలక్షణమైన పాత్రల్లో సలక్షణంగా నటించిన గుమ్మడికి 'మహామంత్రి తిమ్మరుసు' చిత్రం ఎనలేని పేరు సంపాదించి పెట్టింది. ఈ చిత్రం ద్వారా ఆయనకు రాష్ట్రపతి బహుమతి కూడా లభించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆయనను 'కళాప్రపూర్ణ' గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది. రాష్ట్రప్రభుత్వం 'రఘుపతి వెంకయ్య అవార్డు'తో గౌరవించింది. సాత్వికాభినయంలో తనకు తానే సాటి అనిపించుకున్న గుమ్మడి పేరు తలచుకోగానే ఆయన ధరించిన అనేక వైవిధ్యమైన పాత్రలు మన కళ్ళ ముందు కదలాడుతూ ఉంటాయి. అదీ గుమ్మడి అభినయంలోని ప్రత్యేకత! గుమ్మడి తన చివరి రోజుల్లో చిత్రసీమలో తన అనుభవాలను 'తీపి జ్ఞాపకాలు ? చేదు గుర్తులు' పేరుతో రాసుకున్నారు. 2010 జనవరి 26న గుమ్మడి తుదిశ్వాస విడిచారు. తెలుగు చిత్రసీమ చూసిన మహానటుల్లో గుమ్మడి పేరు శాశ్వతంగా నిలచిపోతుంది. నవతరం ప్రేక్షకులు సైతం గుమ్మడి మెథడ్ యాక్టింగ్ చూసి ముగ్ధులవు తున్నారు..

## రూపాయి విలవిల...

ముంబయి,అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ రోజురోజుకు పతనం అవుతోంది. ఇది మరింతగా అగాథంలోకి పడిపోతోంది. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా డాలర్ విలువ రూ.83.47కు చేరువయ్యింది. రికార్డు స్థాయికి చేరిన మన విదేశీ మారక నిల్వలు ఇప్పుడు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి. రూపాయి అదుపునకు ఆర్బీఐ యథేచ్ఛగా డాలర్లను వెదజల్లడం, విదేశీ ఇన్వెస్టర్లు డాలర్లను తరలించుకుపోవడంతో ఇప్పుడు మన వద్ద ఫారెక్స్ నిల్వలు కరిగిపోతున్నాయన్న ఆందోళన కూడా ఉంది. ఇలా ఒకదాని వల్ల మరొకటి పెరిగిపోవడం, తద్వారా రూపాయి మరింత క్షీణించడం, ధరలు ఆకాశాన్నం టడం చకచకా జరిగిపోతాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది ఆల్‌టైం రికార్డ్ గా చూడాలి. డాలర్ మారకంలో రూపాయి విలువ రికార్డు కనిష్టస్థాయికి పడిపోయి రూ.83.47 వైపు చూస్తున్నది. కరెన్సీ పతనంతో పెట్రోల్, డీజిల్, వంటనూనెలు, పప్పులు తదితరాల ధరలన్నీ ఆకాశాన్ని తాకాయి. రూపాయి పతనాన్ని నిలువరించేందుకు రిజర్వ్ బ్యాంక్ ప్రయత్నాలు చేసినా ఉపయోగం లేకుండాపోయింది. 2014కు ముందు బిజెపి అధికారంలోకి రాకముందు.. డాలర్‌తో రూపాయి విలువ 68కి పడిపోతే నరేంద్ర మోడీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రూపాయి ఐసియులో పడిపోయిందని.. తాము అధికారంలోకి వస్తే దేశీయ కరెన్సీని ప్రపంచ మార్కెట్‌లో నిలదొక్కుకునేలా చేస్తామని అనేక గొప్పలు చెప్పారు. ప్రస్తుతం అంతకంటే దారుణమైన స్థితిలోకి రూపాయి పడిపోతున్న ప్పటికీ.. కట్టడి చర్యలు కానరావడం లేదని నిపుణులు విమర్శిస్తున్నారు. దేశీయ గణంకాలు బలహీనంగా చోటు చేసుకో వడానికి తోడు అంతర్జాతీయం గా డాలర్ విలువ పెరగడం రూపాయిని ఒత్తిడికి గురి చేసిందని ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. ప్రస్తుత ఏడాది జూన్‌లో భారత ఎగుమతుల కంటే దిగుమతులు అధికంగా చోటు చేసుకోవడం.. రికార్డ్ స్థాయిలో వాణిజ్య లోటు పడటంతో రూపాయిపై మరింత ఒత్తిడి చోటు చేసుకుంది. డాలర్‌తో రూపాయి విలువ ఇంతటితోనే ఆగుద్దని అనుకోవడానికి లేదని ఆర్థికనిపుణులు పేర్కొంటున్నారు. భారత్‌లోనూ మందగమన భయాలు, అధిక చమురు ధరలు, అంతర్జాతీయ ప్రతికూల అంశాలు, ఎఫ్‌ఐఐలు వరుసగా తరలిపోవడం, ఆర్‌బిఐ వద్ద మారకం నిల్వలు తగ్గిపోవడం తదితర అంశాలు రూపాయిని కుదేలు చేస్తున్నాయి. రూపాయి పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశంలో దిగుమతి ఆధారిత అనేక ఉత్పత్తుల ధరలు భారీగా పెరగనున్నాయి. చమురు ధరలు ఎగిసిపడనున్నాయి. అధిక ధరలతో ఇప్పటికే ప్రజలు తీవ్ర బెంబేలెత్తుతున్నారు. విదేశీ అప్పులు తీవ్ర భారం కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మరింత పన్నుల భారాన్ని మోపనుంది.

# చైనా సైబర్ నేరగాళ్ల చెరలో భారతీయులు

## అమెరికాలో మరో తెలుగు విద్యార్థి దుర్మరణం

కాకినాడ,ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన భారతీయ విద్యార్థుల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన గద్దె సాయి సూర్య అవినాశ్ (26) యూస్ లోని న్యూయార్క్ లో తన అక్క దగ్గర ఉండి మాస్టర్స్ చదువుతున్నాడు. 7 జూలై ఆదివారం కావడంతో అక్క కుటుంబంతో కలిసి న్యూయార్క్ సమీపంలోని అల్బానీ ప్రాంతంలో ఉన్న బార్బర్‌విల్లీ జలపాతానికి అవినాశ్ వెళ్లాడు. నీటి ఉధృతికి అవినాశ్ కాలుజారి కిందపడి కొట్టుకుపోయాడు. అతడ్ని రక్షించేందుకు మరొకరు నీటిలోకి దూకగా అతడు కూడా కొట్టుకుపోయాడు. అయితే వెంటనే అక్కడి భద్రతా దళాలు, సహాయ సిబ్బంది సహాయ కార్యక్రమాలు చేపట్టడంతో ఓ వ్యక్తి ప్రాణాలతో బయటపడగా.. అవినాశ్ మాత్రం మృతి చెందాడు. శుక్రవారం అవినాష్ డెడ్ బాడీ స్వగ్రామానికి చేరుకుంటుంది. అవినాష్‌ది తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాల గ్రామం. ఎంఎస్ చేయడానికి 2023 జనవరిలో అమెరికా వెళ్లాడు. నెల కిందట ఇద్దరు తెలుగు విద్యార్థులు వేర్వేరు ప్రాంతాల్లో జలపాతాల సందర్శనకు వెళ్లి మరణించారు.

## ఉచిత సిలిండర్ల పేరుతో మోసం

హైదరాబాద్, రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సరఫరా చేసే భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ తమ కస్టమర్లను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. నేరగాళ్లు తమ కంపెనీ లోగో ఉపయోగించి ఫ్రీ గ్యాస్ సిలిండర్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని.. వినియోగదారులను హెచ్చరిస్తూ సర్క్యులర్ జారీ చేసింది. వాట్సాప్ ద్వారా నకిలీ ఖాతాను ఇన్ స్టాల్ చేయించి.. కస్టమర్ల సున్నితమైన సమాచారాన్ని దొంగిలించడానికి యత్నిస్తున్నారని కంపెనీ తెలిపింది. మోసగాళ్ల మాటలు విని ఒక వినియోగదారుడు ఇప్పటికే డబ్బు చెల్లించారని భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ పేర్కొంది. 'కస్టమర్లు జాగ్రత్తగా ఉండాలని, అనధికారిక యాప్ ఫైళ్లను డౌన్‌లోడ్ చేయకుండా ఉండమని కోరుతున్నాం..' అని బిజిపి ప్రకటన చేసింది.భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ సమాచారాన్ని దుర్వినియోగం చేస్తున్న నేరగాళ్లు 9940364176 (వాట్సాప్), 9390958942 (మొబైల్) నంబర్లను ఉపయోగిస్తున్నారని కంపెనీ తెలిపింది. ఈ నంబర్ల నుండి వచ్చే సందేశాలు లేదా కాల్స్‌కు ప్రజలు స్పందించవద్దని సూచించింది. అలాగే బిజిపిపేరుతో తెలియని నంబర్ల నుండి వచ్చిన సందేశాలు లేదా చిరజీబిబం÷ఔ కమ్యూనికేషన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరింది. పాస్‌వర్డ్‌లు లేదా వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేయవద్దని హెచ్చరించింది.

## నైపుణ్యాలు కరవు

న్యూఢిల్లీ, దేశీయ విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అసరముందని గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత విద్యావిధానానికి అద్దం పడుతున్నాయి. ఒకప్పుడు భారతీయ విద్యా ప్రపంచానికి వెలుగుదివ్వెగా ఉండేది. విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధి చేసేలా శిక్షణ ఉండేది. కేవలం చదువలే గాకుండా అన్నిరంగాల్లో ఆరితేరేలా చేసేది. గురుకుల విద్యా విధానంలో అలాంటి అద్భుతాలు ఉండేవి. ఆనాడే అందరికీ ఒకే తరహా విద్యావిధానం అమల్లో ఉండేది. బ్రిటిషర్ల పాలన మొదలయ్యాక మన గురుకులాలను పాతరేశారు. మెకాలే తరహా విద్యావిధానం పట్టుకుని మనం ఇంకా పాకులాడడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యం పెరగడం లేదు. దీనికితోడు నీట్ పరీక్షల అవతకవలు విద్యార్థులను మానసిక ఆందోళనకు గురి చేస్తోంది. ఒత్తి పరీక్షల్లో పడి విద్యార్థులు అసువులు బాస్తున్నారు.ఇదే విషయాన్ని ప్రధాని సహా మేధావులు కూడా అంగీకరిస్తున్నారు. అయితే దీనిని మార్చే ప్రక్రియను చేపట్టడం ద్వారా భారతీయ విద్యను అంతర్జాతీ స్థాయిలో పోటీపడేలా చేయాలి. బ్రిటీష్ వాళ్లు తమ అవసరాలను తీర్చుకోవడానికి అనుగుణంగా బానిస వర్గాన్ని సృష్టించే విద్యా విధానాన్ని దేశంలో అమలు చేశారు. జాతీయ విద్యా విధానం అమలుకు సంబంధించి జరుగుతున్న ప్రయత్నాలను వేగవంతం చేయాలి. కేవలం డిగ్రీ పట్టాలను అందిచడమే కాకుండా దేశాన్ని ముందుకు నడిపే మానవ వనరులను అదించేలా విద్యా వ్యవస్థ ఉండాల్సి అవసరం గుర్తించాలి. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో కొన్ని మార్పులు జరిగాయి. అయితే ఇంకా చాలా మార్పులు చేయాల్సిన అవసరముంది. ఇప్పుడు పిల్లలంతా ఇతరులపై పోటీ పడేందుకు గూగుల్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రతిదీ గూగుల్‌లో సర్చ్ చేయడం అలవాటు చేసుకున్నారు. శారీరక శ్రమతో పాటు మానసిక ధృఢత్వాన్ని ప్రస్తుత విద్యావిధానంలో అమలు కావడం లేదు. మన విద్యా ప్రాంగణాలలో అలాంటి పిల్లలకు అవసరమైన వాతావరణం కల్పించాల్సి ఉంది. ఎన్ఇపి ద్వారా భారతీయ భాషల్లో విద్యనభ్యసించేందుకు తలుపులు తెరుచుకోవాలి. ప్రపంచ విద్యాభ్యాస గమ్యస్థానంగా భారత్ ఎదిగేలా చేయాలి. ఎంతసేపూ మనం విదేశాలకు వెళ్లకుండా మనవద్దకే వచ్చేలా చేయగలగాలి. గతేడాది యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), బెనారస్ హిందూ యూనివర్సిటీతో కలిసి కేంద్ర విద్యాశాఖ మూడు రోజుల పాటు ఈ సదస్సును నిర్వహించింది. అప్పట్లో వలస పాలకుల సొంత అవసరాలు తీర్చుకోవడమే ఆ విద్యా వ్యవస్థ లక్ష్యంగా మారింది. ఇప్పటికీ చాలా వరకు మార్పు లేకుండానే అది కొనసాగుతోంది. విద్యావ్యవస్థ అంటే కేవలం డిగ్రీ హోల్డర్లను ఉత్పత్తి చేయడమే కాదు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన మానవ వనరులను అందించాలన్న లక్ష్యం కావాలి.డిగ్రీల కోసం కాకుండా, భవిష్యత్ వర్క్‌ఫోర్స్‌గా తమను తాము రూపొందించుకునేందుకు యువత సిద్ధం కావాల్సి ఉంది. విద్యా వ్యవస్థను సంకుచిత ఆలోచనల నుంచి బయటికి తీసుకురావాలి. అప్పుడే మన లక్ష్యం నెరవేరగలదు. అందుకు మానవవనరులను అభివృద్ధి చేసే విద్యావిధానం రావాల్సి ఉంది. చదువు ఏదయినా స్వశక్తితో నిలబడగలిగేలా పౌరులను తీర్చిదిద్దగలగాలి.

### త్వరితగతిన సీతారామ ప్రాజెక్ట్ పనులు

కొత్తగూడెం,సీతారామ ప్రాజెక్టు కాలువల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడవద్దని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలో మంగళవారం పర్యటించిన ఆయన.. గుంపెన గ్రామ శివారులో జాతీయ రహదారిపై నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు కాలువ వంతెన, కాలువ నిర్మాణ పనులను భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టు కాలువ నిర్మాణ పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకొన్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. పనులను వేగవంతంగా చేప ట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలువ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీతారామ ప్రాజెక్టు సీఈ ఏ.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఈ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ అర్జున్, డీఈఈ భాస్కర్‌రావు తదితరులు న్నారు.

## చైనా సైబర్ నేరగాళ్ల చెరలో భారతీయులు

హైదరాబాద్, విదేశాల్లో ఉద్యోగాన్వేషణలో ఉన్న యువతి, యువకులే వారి టార్గెట్. మొదట జాబ్ ఆఫర్ ఉందంటారు. 'మంచి కంపెనీలో, ఆకర్షణీయమైన వేతనంతో మీ కోసం కొలువు కోసం చూస్తున్నానని' ఊరిస్తారు. ఇది చూసి మాయలో పడ్డామో.. ఇక, అంతే. మన దగ్గర ఉన్న డబ్బంతా ఊడ్చేసి.. పాస్‌పోర్ట్‌ను లాగేసుకొని.. ఓ కట్టు బానిసలా.. ఇరుకిరుకు చీకటి గదిలో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు, సైబర్ నేరాలకు ఓ పావుగా వాడుకుంటున్నారు. ఎదురుతిరిగామో.. యువకులనైతే అన్నంపెట్టకుండా చితకబాదుతారు. అమ్మాయిలైతే, న్యూడ్ వీడియోలను సోషల్‌మీడియాలో వైరల్‌గా బెదిరిస్తారు. దేశంకాని దేశం. ఏంచెయ్యాలో కూడా తెలియని దుస్థితి. అలా జీవితం క్రమంగా అంధకారంలోకి దిగజారిపోతుంది. ఇదేదో.. సినిమా స్టోరీ కాదు. భారత్‌కు చెందిన దాదాపు మూడు వేలమందిని ఇలాగే చైనాకు చెందిన కొందరు సైబర్ నేరగాళ్లు చెరబట్టారు. కంబోడియాకు రహస్యమార్గంలో అక్రమంగా తరలించి ఇరుకిరుకు గదుల్లో బంధించారు. ఆ బందీఖానా నుంచి ఎలాగోలా తప్పించుకొన్న మహబూబాబాద్ బయ్యారం మండలానికి చెందిన మున్షీ ప్రకాశ్ తన అనుభవాన్ని జాతీయ పత్రిక 'టైమ్స్ ఆఫ్ ఇండియా'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వివరించాడు. ఆ భయానక అనుభవాలు అతడి మాటల్లోనే..

ట్రావెల్ హిస్టరీ ఉండాలంటే..

బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశా. హైదరాబాద్‌లోని ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం చేసేవాడిని. అయితే, విదేశాల్లో ఉన్నతోద్యోగం చేయడం నా కల. దీనితో జాబ్ సైట్లలో నా ప్రొఫైల్‌ను అప్‌లోడ్ చేశా. కొద్దిరోజుల తర్వాత విజయ్ అనే ఏజెంట్ నాకు ఫోన్ చేశాడు. అతనిది కంబోడియాగా చెప్పాడు. ఆస్ట్రేలియాలో ఓ మంచి కంపెనీలో, ఆకర్షణీయమైన వేతనంతో ఉద్యోగావకాశం ఉంది అని ఊరించాడు. ఇంతకు ముందు విదేశాలకు వెళ్లావా? అని నన్ను అడిగాడు. లేదన్నా. ఆయన మాట్లాడుతూ.. ఆస్ట్రేలియాకు రావాలంటే అంతకుముందే ఏదైనా దేశానికి ప్రయాణం చేసి ట్రావెల్ హిస్టరీ ఉండాలన్నాడు. మలేషియాకు ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసినట్టు చెప్పాడు. దీంతో ఎంతో సంబురంగా ??విమానం ఎక్కాను.

అక్కడి నుంచి వేధింపులు మొదలు..

కౌలాలంపూర్ విమానాశ్రయంలో దిగగానే అక్కడి నుంచి కొందరు వ్యక్తులు నన్ను కంబోడియా రాజధాని ఫెనోమ్ ఫెన్‌కు మార్చి 12న తీసుకెళ్లారు. ఏజెంట్ విజయ్ పంపించాడని తనకు తాను పరిచయం చేసుకొన్న ఓ వ్యక్తి నా దగ్గరున్న కొంతమంది అమెరికన్ డాక్యుమెంటును (విలువ రూ. 85 వేలు) తీసుకొన్నాడు. అతనితో వచ్చిన మరికొందరు చైనీయులు నా దగ్గరున్న పాస్‌పోర్ట్‌ను తీసుకొని కంబోడియాలోనే మరో పట్టణం క్రోంగ్ బావెట్‌కు తీసుకెళ్లారు. పెద్ద భవంతులతో కూడిన మైదానం అది. అందులో ఓ భవంతి (టవర్ సీ)లోకి నన్ను



తీసుకెళ్లారు.యువతీ, యువకులతో కలిపి అక్కడ దాదాపు 3 వేల మంది భారతీయులు ఉన్నారు. అందులో తెలుగువాళ్లే ఎక్కువ. వెళ్లినప్పటి నుంచి దాదాపు పది రోజులపాటు అమ్మాయిల ప్రొఫైల్ ఫోటోలు, పేర్లతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు ఎలా క్రియేట్ చేయాలి? సైబర్ దాడులు, హనీ ట్రాపింగ్ ఎలా చేయాలి? అన్న విషయాలను నేర్పించారు. స్నానం చేసేటప్పుడు అమ్మాయిల న్యూడ్ వీడియోలు తీసేవారు. తప్పుడు పనులు చేయబోమని ఎదురుతిరిగితే యువకులకు ఆహారం పెట్టకుండా చితకబాదడం మానేశారు. ఎదురుతిరిగిన అమ్మాయిలను తమ న్యూడ్ వీడియోలను సోషల్‌మీడియాలో వైరల్ బెదిరించేవారు. హనీట్రాపింగ్‌లో భాగంగా న్యూడ్‌లో వీడియో కాల్స్ చేయాలంటూ కొందరు యువతులను బలవంతపెట్టేవారు.

అలా బయటపడ్డా..

ముఖ్యంగా తెలుగులో అమ్మాయిల ఫేక్ ఫొటోలతో అకౌంట్లు క్రియేట్ చేయమని నన్ను బలవంతపెట్టేవారు. వ్యతిరేకించిన నన్ను ఓ చీకటి గదిలో వారంపాటు ఉంచి వేధించారు. అస్వస్థతకు తగిన. చీకటి రూమ్ నుంచి నన్ను వేరే గదికి మార్చారు. జబ్బుతో పనిచేయాలని బలవంతపెట్టారు. ఎలాగోలా ఓ మొబైల్ సంపాదించి సెల్ఫీవీడియోలో నా బాధనంతా రికార్డు చేశా. తమిళనాడులోని మా సోదరికి మెయిల్ చేశా. ఆమె అధికారులను సంప్రదించింది. అయితే, ఏప్రిల్ 16న కంబోడియా పోలీసులు ఓ ఆపరేషన్‌లో భాగంగా నన్ను రక్షించారు.అయితే సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో అరెస్ట్ చేశారు. 12 రోజులు జైలు జీవితం అనుభవించిన తర్వాత ఇండియన్ ఎంబాసీ సహకారంతో విడుదలయ్యా. జూలై 5న భారత్‌కు తిరిగొచ్చా. అయితే, కంబోడియాలోని చైనా సైబర్ నేరగాళ్ల డెన్‌లో 3 వేల మంది భారతీయులు ఇంకా బందీలుగా ఉన్నారు. అందులో మన తెలుగు సినిమాలవారే ఎక్కువ. ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు వారిని రక్షించే చర్యలు చేపట్టాలని ప్రకాశ్ ఈ సందర్భంగా అభ్యర్థించాడు.

## ఎవరు జవాబుదారీ?



న్యూఢిల్లీ,పూరీలో ఆదివారం వైభవోపేతంగా జరిగిన జగన్నాథుడి రథయాత్రలో తొక్కిసలాట జరిగిందంటూ వెలుగు చూసిన వారి గుండెల్లో గుబులు పుట్టింది. ఏటా అంగరంగ వైభవంగా జరిగే జగన్నాథ రథయాత్రలో లక్షలాది భక్తులు పాల్గొనడం రివాజు. ఈ సందర్భంగా తొక్కిసలాట అంటూ జరిగితే ఎంతమంది ప్రాణాలు గాలిలో కలిసిపోతాయో ఊహించుకుంటేనే ప్రాణాలు తావులు తప్పుతాయి. ఉత్తరప్రదేశ్‌లోని హథ్రస్‌లో ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో 121 మంది మరణించి పట్టుమని పదిరోజులైనా కాకముందే అటువంటి సంఘటనే పూరీలో జరిగిందనేసరికి ఎవరికైనా ఆందోళన కలగడం సహజం.అదృష్టవశాత్తూ రథయాత్రలో జరిగిన తొక్కిసలాటలో 60 ఏళ్ల వృద్ధుడు కన్నుమూయడం మినహా ఎక్కువ ప్రాణనష్టం జరగక అందరూ ఊపిరి పీల్చుకుని ఉంటారు. అయితే ఎండ వేడిమి, విపరీతమైన రద్దీ కారణంగా శ్వాస ఆడక మూడు వందలమందికి పైగా భక్తులు ఆస్పత్రుల పాలు కావడం విస్మరించలేని విషయం. అత్యంత జనాభాతో, భిన్నమతాలతో అలరారే భారతదేశంలో ఆధ్యాత్మిక, మతపరమైన కార్యక్రమాలకు భక్తజనం భారీ సంఖ్యలో హాజరుకావడం, పలు సందర్భాల్లో తొక్కిసలాటలు జరిగి వందల సంఖ్యలో ప్రాణాలు కోల్పోవడం పరిపాటిగా మారింది. కుంభమేళాలు, పుష్కరాలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు బాబాలు, మత పెద్దలు నిర్వహించే కార్యక్రమాల్లో తోపులాటలు, తొక్కిసలాటలు జరుగుతూ ఉంటాయి. పదేళ్ల క్రితం ఒక అంతర్జాతీయ పత్రిక ప్రచురించిన ఓ సర్వేలో ఇండియాలో 79% తొక్కిసలాటలు, తీర్థయాత్రలు, మతపరమైన ఊరేగింపులు, సభలు, సమావేశాలలోనే జరుగుతున్నట్లు యాత్ర.ముఖ్యంగా ఆలయాలు, నదీతీర ప్రాంతాలు తొక్కిసలాటలకు కేంద్ర బిందువులుగా ఉంటున్నట్లు ఆయన సర్వే స్పష్టం చేసింది. సాధారణంగా భారీ సంఖ్యలో జనం గుమిగూడినప్పుడు అకస్మాత్తుగా చెలరేగే వదంతులు భయభ్రాంతులకు గురిచేస్తాయి. ఎటుపోవాలో, ఏం చేయాలో దిక్కుతోచని జనం అక్కడి నుంచి బయటపడేందుకు ఒక్కసారిగా పరుగులు తీయడంతో తొక్కిసలాట జరుగుతుంది. ఇలాంటి సందర్భాల్లో జరిగే ప్రాణనష్టం ఊహాతీతం. తొక్కిసలాటలంటూ జరిగితే ముందుగా బలయ్యేది పిల్లలు, మహిళలు, వృద్ధులే. మొన్నటి హథ్రస్ సంఘటనలో మృతులలో కూడా వందకు పైగా మహిళలు, పిల్లలు ఉండటం లేదు. జనాన్ని అదుపు చేసే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోని పక్షంలో అవాంఛనీయ సంఘటనలు జరిగితే వారిని అదుపు చేయడం మానవమాత్రులకు సాధ్యం కాదు. హథ్రస్ సంఘటననే ఉదాహరణగా తీసుకుంటే 80 వేల మందికి మాత్రమే అనుమతి ఉన్న సంఘటన స్థలంలో రెండున్నర లక్షల మంది రావడం తొక్కిసలాటకు ప్రధాన కారణంగా పోలీసులు చెబుతున్నారు. అయితే 80 వేల మంది వచ్చినా వారి భద్రతకు ఏం చర్యలు తీసుకున్నారనే ప్రశ్న. భారీ యెత్తున జనాలు హాజరయ్యే అనేక చోట్ల తీసుకోవలసిన భద్రతా ఏర్పాట్ల గురించి జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ 2014లో నియమ నిబంధనలను రూపొందించినా వాటిని అమలు చేయడంలో పోలీసులు దారుణంగా విఫలమవుతున్నారని గత పదేళ్లలో జరిగిన అనేక తొక్కిసలాటలను ఉదాహరణగా చెప్పవచ్చు.గత ఏడాది ఇండోర్‌లో శ్రీరామనవమి ఉత్సవాల్లో జరిగిన తొక్కిసలాటలో 36 మంది కన్నుమూశారు. ఇలాంటి తొక్కిసలాట సంఘటనల్లో 2008లో రాజస్థాన్‌లో జరిగిన సంఘటన ఘోరమైనది. జోధ్‌పూర్‌లోని చాముండదేవి ఆలయం వద్ద తొక్కిసలాట జరిగి 250 మంది బలికావడం మరచిపోలేని దుర్ఘటన. భారీయెత్తున ఆధ్యాత్మిక సభలకు యథాపంగా, కళ్లుమూసుకుని అనుమతులు ఇచ్చే పోలీసులు సంఘటనలను సందర్శించి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలనే సంగతిని మరచిపోతున్నారు. వేలు, లక్షల్లో జనం హాజరయ్యే చోట్ల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు ఉన్నాయో లేదో చూడటం పోలీసుల ప్రథమ కర్తవ్యం. అవాంఛనీయ సంఘటనలు తలెత్తితే, ప్రమాదం నుంచి జనం తప్పించుకోవడానికి అత్యవసర ద్వారాలనూ ఏర్పాటు చేయాలి. వాటితోపాటే తాగునీరు, ప్రాథమిక చికిత్స సౌకర్యాలు సైతం కల్పించగలగాలి. అంబులెన్సులను సిద్ధంగా ఉంచడమూ తప్పనిసరి. అయితే ఇలాంటి కనీస భద్రతా ఏర్పాట్ల గురించి పట్టించుకోని అధికార యంత్రాంగం చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి, మృతులను పోస్టుమార్టానికి పంపించి చేతులు దులుపుకోవడం గర్హనీయం. తొక్కిసలాటలు జరిగినప్పుడు సదరు అధికార యంత్రాంగాన్ని, పోలీసులను కూడా బాధ్యులుగా చేసినప్పుడే ఇలాంటి సంఘటనలకు కళ్లెం పడేది!

## చట్నీలో ఎలుక ఘటనపై మంత్రి ఆగ్రహం

సంగారెడ్డి,చట్నీలో ఎలుక పడిన ఘటనపై తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్, ఆర్డీవో, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులను మంత్రి దామోదార రాజనర్సింహ ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్‌లోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్‌లో చట్నీలో ఎలుక కనిపించిన ఘటన కలకలం రేపింది. దీనిపై తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ స్పందించి.. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న హాస్టళ్లు, క్యాంటీన్లను తనిఖీ చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహార పదార్థాలను తయారు చేసే నిర్వాహకులు ఈ÷ూంఎ లైసెన్స్ తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన ఆహారం అందించేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు నిరంతరం హోటళ్లు, రెస్టారంట్లతో పాటు బేకరీలు, హాస్టళ్లు, క్యాంటీన్లు, ఆహార పదార్థాలు తయారు చేసే నిర్వాహకులపై నిఘా ఉంచాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి జేఎన్‌టీయూ క్యాంపస్‌లోని వంట గదిని పరిశీలించారు. వంటగది అపరిశుభ్రంగా ఉండటంతో ప్రిన్సిపల్, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో ఇలాగే ఉంటుందా? అని సిబ్బందిని నిలదీశారు. వెంటనే మెస్ కాంట్రాక్టర్‌ను మార్చాలని ఆదేశించారు. వందలాది మంది విద్యార్థులు తినే ఆహారం ఇలా అపరిశుభ్రంగా ఉండటం ఏంటని ప్రశ్నించారు. అంతకు ముందు విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోజూ తినే ఆహారంలో బొద్దింకలు, బల్లులు, ఎలుకలు కనిపిస్తూనే ఉన్నాయని విద్యార్థులు వాపోయారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం తో పాటు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని వడ్డించాలని సిబ్బందికి సూచించారు.

### 16న ఏపి కేబినేట్ భేటీ..

అమరావతి,ఈనెల 16న ఏపీ కేబినెట్ సమావేశం జరగనుంది. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సెక్రటేరియట్‌లోని ఫస్ట్ బ్లాక్‌లో రాష్ట్ర మంత్రివర్గం భేటీ కానుంది. ఇప్పటికే కేబినెట్ భేటీకి సంబంధించి మంత్రులకు సమాచారం కూడా వెళ్లింది. ప్రభుత్వం అమలు చేసే పథకాలు, ఎన్నికల హామీలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా భేటీలో

## భూసార కేంద్రాల తీరు అస్తవ్యస్థం

విశాఖపట్టణం,సిబ్బంది కొరతతో భూసార పరీక్షా కేంద్రాలు నిస్తేజంగా మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీల్లో భూసార పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏటా జనవరి నుంచి మే నెలాఖరు వరకు మాత్రమే భూసార పరీక్షలు చేస్తుంటారు. మిగిలిన సమయంలో భూసార పరీక్షలు పెద్దగా జరగవు. అంతేకాకుండా గత ఏడాది నుంచి మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, ఆ గ్రామంలో ఉన్న అన్ని సర్వే నంబర్లలోని భూముల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నామమాత్రంగా ఉన్న సిబ్బంది పైలట్ గ్రామాల్లో మాత్రమే భూసార పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో నాలుగు కేంద్రాలు వుండగా, ఒక్క అనకాపల్లిలో మాత్రమే భూసార పరీక్షలు జరుగుతున్నాయి. పొలాల్లో మట్టిని సేకరించి, ల్యాబ్‌లో పరీక్షించి రైతులకు వివరాలు అందజేయడానికి ఎవరూ లేకుండా పోయారు. ఆయా కేంద్రాలకు రైతులకు తీసుకువచ్చిన మట్టి నమూనాలను అనకాపల్లి పంపుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రస్తుతం ఉన్న భూసార పరీక్షా కేంద్రాల పరిస్థితి పరిశీలించగా... మొక్కుబడిగా పనిచేస్తున్న విషయం తెలిసింది. జిల్లాలో నర్సీపట్నం, అనకాపల్లి, పాడేరు, విశాఖపట్నంలో మాత్రమే భూసార పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో సంచార భూసార పరీక్షా కేంద్రం ఉంది. అయితే ఈ కేంద్రం జిల్లాలో సంచరించేందుకు వాహనం లేకపోవడంతో అక్కడ ఉండే సిబ్బందికి జిల్లాలో కొన్ని మండలాలకు కేటాయించారు. నర్సీపట్నంలో భూసార పరీక్షా కేంద్రాన్ని సుమారు పదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. కొన్నాళ్ల తర్వాత తొలగించారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో సరైన సిబ్బంది లేరు. కేంద్రంలో మట్టి నమూనాలను పరీక్షించేందుకు అవసరమైన పరికరాలు, రసాయనాలు, ఇతర సామగ్రి ఉన్నప్పటికీ పరీక్షలు నిర్వహించే సిబ్బంది లేకపోవడంతో అలంకారప్రాయంగా మారింది. దీంతో రైతులు ఎవరైనా మట్టి నమూనాలను తీసుకువస్తే వాటిని అనకాపల్లి భూసార పరీక్షా కేంద్రానికి పంపిస్తున్నారు. పాడేరు కేంద్రంలో కూడా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. దీనివల్ల భూసార పరీక్షల ఫలితాల వెల్లడిలో తీవ్ర జాప్యం జరుగుతున్నది.

### 25 వేల గ్రామ సమైఖ్య సంఘాలకు కోటి సాయం

హైదరాబాద్,రానున్న ఐదేళ్ళలో రాష్ట్రంలోని 25 వేల గ్రామ సమైఖ్య సంఘాలకు కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. వనమహోత్సవం, మహిళాశక్తి, ప్రజాపాలన సహాయ కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, వ్యవసాయ సంబంధిత అంశాలు, ధరణి, ఉద్యోగుల బదిలీలు, గృహనిర్మాణం తదితర అంశాలపై నేడు జిల్లా కలెక్టర్లతో సి.ఎస్ శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో ప్రస్తుత సీజన్ లో 20.02 కోట్ల మొక్కలు నాటెందుకు లక్ష్యంగా నిర్ణయించామని, దీనిలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికే వరంగల్ లో వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రంలో సరిపడ మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ఇటీవలి కాలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున జిల్లాల వారీగా కేటాయించిన లక్ష్యాల మేరకు నాణ్యమైన మొక్కలను నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. నాటిన ప్రతీ మొక్క ను జియోటాగింగ్ చేయడంతో పాటు వాటి మనుగడకు చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామాల్లో 100 శాతం ఖాళీ స్థలాలు కవర్ అయ్యే విధంగా మొక్కలు నాటేందుకు జిల్లాలోని సీనియర్ అధికారులు దత్తత తీసుకోవాలని సూచించారు. ఎ÷-లాంటేషన్ సైట్లను జిల్లా అధికారులు, క్షేత్ర స్థాయి అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలోని 25 వేల గ్రామ సమైఖ్య సంఘాలకు కోటి రూపాయల ఆర్థిక సహాయం రాష్ట్రంలో రానున్న ఐదేళ్ళలో రాష్ట్రంలోని 25 వేల గ్రామ సమైఖ్య సంఘాలకు కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయడం ద్వారా రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళలను కోటీశ్వరులను చేయాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక బృందాలలో ఇప్పటికీ చేరని మహిళలందందరినీ చేర్పించాలని, రానున్న ఐదేళ్ళలో స్వయం సహాయక మహిళలను కోటీశ్వరులు చేయాలన్న లక్ష్య సాధనకు త్వరలోనే ఒక విధాన నిర్ణయం పత్రాన్ని విడుదల చేయనున్నట్టు సి.ఎస్ తెలిపారు. మహిళా సంఘాల ద్వారా పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ ల తయారీ పనులను సకాలం లో పూర్తి చేసి ప్రశంసలు అందుకున్నారని అభినందించారు. రెండో సెట్ యూనిఫామ్ ల పనులను కూడా త్వరలోనే పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని జిల్లాల్లో ఇందిరా క్యాంటీన్ ల ఏర్పాటు ను త్వరితగతిన ప్రారంభమయ్యేలా చొరవ చూపించాలి. ఇంకా అసంపూర్తిగా గా ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను రెండు వారాల్లో పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గత సంవత్సరం, ఈ నాటికి, 44 లక్షల ఎకరాల్లో నాట్లు పడగా ప్రస్తుత వానా కాలం సీజన్ లో ఇప్పటికే 50 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారని అన్నారు. అన్ని మండలాల్లో సరిపడా యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయని, వాటి పంపిణీని జిల్లా కలెక్టర్లు ప్రతీ రోజూ పర్యవేక్షించాలని సి.ఎస్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 9 ఉమ్మడి జిల్లాల్లో రైతు భరోసా సదస్సులను నిర్వహిస్తున్నామని, ఈ సదస్సులకు ఆయా జిల్లాలోని రైతులు, రైతు ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వర్షాకాల సీజన్ లో అతిసార, డెంగ్యూ, మలేరియా, చికన్ గున్యా లాంటి వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు సురక్షిత మార్గాలపై ప్రజలను చైతన్య పర్చడంతోపాటు, ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్, ఇంటింటి ఆరోగ్య సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. ఇప్పటికీ, ఈ వ్యాధుల ఆనవాలు కన్పించిన జిల్లాల్లో మరింత అప్రమత్తతో ఉండాలన్నారు. అన్ని జిల్లా కేంద్రాలలో 24 / 7 పనిచేసే హెల్ప్ లైన్లను ఏర్పాటు చేయడంతో పాటు రాపిడ్ రెస్పాన్స్ టీమ్ లను ఏర్పాటు చేయాలన్నారు.రాష్ట్రంలో భూ సంబంధిత వివాదాలకు సంబంధించి అందిన ధరణి ఫిర్యాదుల పరిష్కారానికి మరింత శ్రద్ధ చూపించాలని జిల్లా కలెక్టర్లను సి.ఎస్ శాంతి కుమారి ఆదేశించారు. ఇప్పటికే, గత రెండున్నర యేళ్లుగా 57 వేల దరఖాస్తులకు పైగా జిల్లాల్లో పరిష్కారించారని, పెండింగ్ లో ఉన్న దరఖాస్తులన్నింటినీ పరిష్కరించ డానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారంలో గణనీయమైన పురోగతి ఉందని ప్రశంసించారు. మిగిలినవి రాబోయే 10 రోజుల్లో పరిష్కరించాలన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా మరింత సమర్థవంతమైన సేవలను ప్రజలకు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాల న్నారు. ఉద్యోగుల బదిలీల పక్రియను ఈనెల 20 వ తేదీ లోగా ఎట్టిపరిస్థితిలోనూ పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. ఇప్పటికే, శాఖల వారీగా ఖాళీల వివరాలను ప్రకటించడం జరిగిందని, సంబంధిత ఫారాలను పొందిన అనంతరం ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం బదిలీల పక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని


# ఆనాడు టీఆర్ఎస్ కరెక్ట్...నేడు కాంగ్రెస్ ద్రోహం



హైదరాబాద్, రాజ్యాంగ బద్దంగా అంటే..పార్టీలోని మెజార్టీ సభ్యులను విలీనం చేసుకుంటే తప్పులేదు..ఒక్కొక్కరిని చేర్చుకుంటేనే తప్పు...మేం పార్టీని రాజ్యాంగ బద్దంగా విలీనం చేసుకున్నాం... కాంగ్రెస్ అలా చేయలేదు.. అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ తాజాగా ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ పార్టీపై విమర్శలు ఎక్కుపెట్టారు. అంటే కాంగ్రెస్ ఇప్పుడు ఏకబిగిన చట్టబద్దంగా, ఎమ్మెల్యేలను వన్ థర్డ్ మెజార్టీతో విలీనం చేసుకోవాలన్న సూచన చేసినట్లు అయ్యింది. అయితే గతానికి భిన్నంగా కాంగ్రెస్ ఒకకో ఎమ్మెల్యేను చేర్చుకుంటోంది. ఇది నూటికినూరు పాల్లు తప్పే. ఈ విషయంలో అన్ని పార్టీలు ఇలాంటి వెర్రి చేష్టలే చేశాయి. ఎలా చేసినా...అధికారంలో ఉన్న పార్టీలు విపక్ష పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నారు. అందుకు బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ మినహాయింపు కాదు. దీనిపై ఇప్పుడు కెటిఆర్ వగచినా లాభంలేదు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ చట్టసభల్లో బలం పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. ఒకవైపు ఎమ్మెల్యేలు, మరోవైపు ఎమ్మెల్సీలను చేర్చుకుంటూ.. అసెంబ్లీలో ఎలాంటి ఇబ్బంది లేకుండా అడుగులు వేస్తోంది. వచ్చే అసెంబ్లీ సమావేశాలకు ముందే శాసనమండలిలో తిరుగులేని పార్టీగా అవతరించాలని చూస్తోంది. అలాగే బిఆర్ఎస్‌ను కూడా దెబ్బతీసి ప్రతిపక్ష హోదా లేకుండా చేసే పనిలో పడింది. గతంలో కెసిఆర్ ఇదే చేశారు. ఇప్పుడు రేవంత్ అదే చేస్తున్నారు. ఇకపోతే తెలంగాణ శాసనమండలిపై కాంగ్రెస్ పార్టీ సీరియస్ ఫోకస్ పెట్టింది. ఇప్పటికే ఎమ్మెల్యేల ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపి సీరియస్‌గా అమలు చేస్తున్న కాంగ్రెస్.. అసెంబ్లీ సమావేశాల్లోపు బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకునేందుకు సీఎం రేవంత్ కసరత్తు ముమ్మరం చేశారు. అటు మండలిపై కూడా గురిపెట్టి.. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్సీలను వరుసగా చేర్చుకుంటున్నారు. మెల్లగా మండలిలో బలం పెంచుకుంటున్నారు. మండలిలో గవర్నర్ కోటాలో రెండు ఖాళీలుండగా.. ప్రస్తుతం 39మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. ఇందులో బీఆర్ఎస్‌కు 19మంది, కాంగ్రెస్‌కు 13మంది, బీజేపీ 1, ఎంఐఎం 2, స్వతంత్రులు ఇద్దరు ఎమ్మెల్సీలు ఉన్నారు. ఎంపీ ఎన్నికల ముందు వరకు కాంగ్రెస్ బలం ఐదుగురు ఎమ్మెల్సీలే. ఎంపీ ఎన్నికల సమయంలో పట్నం మహేందరం రెడ్డి చేరికతో అది ఆరుకు చేరింది. ఇటీవల ఒకేసారి ఆరుగురి చేరికతో.. కాంగ్రెస్ బలం 12కు పెరిగింది. తాజాగా చల్లా వెంకట్రామిరెడ్డి సీఎంను కలవడంతో ఆయన చేరిక కూడా లాంఛనమే అని తెలుస్తోంది. దీంతో మండలిలో కాంగ్రెస్ బలం 13కు చేరనుంది. బీఆర్ఎస్‌కు చెందిన చాలామంది ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. తమకు తదుపరి హామీ ఇస్తే అన్న రీతిలో చేరేందుకు రెడీగా ఉన్నట్లు సమాచారం. అయితే పార్టీ పాలసీ ప్రకారం ముందే హామీ ఇవ్వలేమని పార్టీలో చేరితే మాత్రం సముచిత స్థానం కల్పిస్తామని ముఖ్యనేతలు భరోసా ఇస్తున్నారు. మండలిలో 2/3 మెజారిటీ సాధిస్తే బీఆర్ఎస్ఎల్పీని కాంగ్రెస్‌లో విలీనం చేయొచ్చు అనే భావనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. మరో 9 మందిని పార్టీలోకి ఆకర్షించి 2/3 మెజారిటీ కంప్లీట్ చేసే యోచనలో ఉంది కాంగ్రెస్. పెద్దల సభలో బలం పెంచుకుని.. హస్తగతం చేసుకోవాలని.. కాంగ్రెస్ భావిస్తోంది. అంతేకాదు భవిష్యత్తులో ప్రభుత్వం తీసుకొచ్చే కీలక బిల్లులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండాలంటే మండలిలో మెజారిటీ చాలా అవసరం. ఎమ్మెల్సీలతో మాట్లాడే బాధ్యతను సీఎం రేవంత్ పలువురు మంత్రులకు అప్పచెప్పినట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి మండలి విషయంలో వేగంగా అడుగులు వేయడానికి కారణాలు లేకపోలేదు. తాను ప్రత్యక్షంగా కాంగ్రెస్‌లో చేరకపోయినా.. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.. తన కొడుకు అమిత్ రెడ్డి రాజకీయ భవిషత్తు కోసం కాంగ్రెస్ పార్టీలో చేర్పించి కేసీఆర్ కు షాక్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మండలి చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టే ఆలోచనలో బీఆర్ఎస్ ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. అందుకే అసెంబ్లీ సమావేశాలకు ముందే మెజార్టీ ఎమ్మెల్సీలను కాంగ్రెస్‌లోకి చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు గుత్తా కూడా సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ఆషాడానికి ముందే టాస్క్ పూర్తి చెయ్యాలని, బీఆర్ఎస్ వైఫల్యాలు వారితోనే చెప్పించాలని కాంగ్రెస్ భావిస్తోంది. కొన్నిచోట్ల చేరికలను స్వాగతిస్తుంటే, మరికొన్ని చోట్ల వ్యతిరేకత వినిపిస్తోంది. అందుకే ఈ చేరికలపై బిఆర్ఎస్ ఏడుపు మొదలు పెట్టింది. ఇలాంటి అనుభవం తమకు కూడా వస్తుందని ఆనాడు ఊహించలేక పోయింది. అందుకే ఇప్పుడు కాంగ్రెస్ చేస్తున్న విధానాన్ని విమర్శిస్తోంది.

# తెలంగాణలో చంద్రబాబు ఎంట్రీ.. కాంగ్రెస్ లో కంగారు!

హైదరాబాద్,ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చింది. సీఎంగా చంద్ర బాబు బాధ్యతలు చేపట్టిన నాటినుంచి ఏపీ అభివృద్ధిపై దృష్టిపెట్టారు. ఇప్పటికే పలు రంగాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. అదే సమయంలో సంక్షేమాన్ని విస్మరించడం లేదు. ఐదేళ్ల కాలంలో అభివృద్ధి నోచుకోని ఏపీ ప్రజలు చంద్రబాబు దూకుడుతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పదహారు ఎంపీ స్థానాలతో తెలుగుదేశం అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో కొనసాగడానికి తెలుగుదేశం మద్దతు అత్యవసరం. దీనితో గతంలో ఎప్పుడూలేని ఉత్సాహం తెలుగుదేశం శ్రేణుల్లో కనిపిస్తోంది. బాబు విజయానికి అనుగుణంగా ఏపీ ప్రగతికి, పురోగతికి కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాయనీ, మోడీ సర్కార్ కు తెలుగుదేశం కీలక మద్దతు ఉందని అంటున్నారు. మొదటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఎలాంటి విబేధాలు లేకుండా అభివృద్ధి చెందాలనేది తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఆకాంక్ష. ఏపీలో అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే రెండు తెలుగు రాష్ట్రాలు మధ్య విభజన సమస్యల పరిష్కారంపై చంద్రబాబు దృష్టి కేంద్రీకరించారు. ఈ క్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న సమస్యలను విడతల వారిగా పరిష్కరించుకోవాలని రెండు రాష్ట్రాల సీఎంలు నిర్ణయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. చంద్రబాబు తెలంగాణాలో అడుగు పెట్టడంతో తెలంగాణలోని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా ఉలిక్కిపడుతున్నారు. తమ కాళ్ల కింద భూమి కదిలిపోతుందన్నంత కంగారు పడుతున్నారు. ఏపీ ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత చంద్రబాబు నాయుడు ఇటీవల తొలిసారి తెలంగాణలో అడుగుపెట్టారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో తెలంగాణ తెలుగుదేశం పార్టీ నేతలతో సమావేశం అయ్యారు. రాష్ట్ర నలు మూలల నుంచి భారీ సంఖ్యలో తెలుగుదేశం కార్యకర్త ఈ సమావేశంలో కొనసాగుతోంది. ఈ క్రమంలో తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలోపేతంపై దృష్టిపెడతానని, మంచిరోజులు రాబోతున్నాయని చంద్రబాబు వ్యాఖ్యానించడం తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. తెలంగాణలో చంద్రబాబు అడుగు పెడుతున్నారంటే బీఆర్ఎస్ నేతల్లో ఆందోళన ఉంటుంది. ఎందుకంటే, తెలంగాణాలో తెలుగుదేశం బలోపేతం అయితే బీఆర్ఎస్ పార్టీకి ఆదరణ తగ్గుతుందంటే ఆ పార్టీ నేత ల భయం. ఈ భావనతోనే చంద్రబాబు తెలంగాణ రాజకీయాలపై ఎప్పుడు ప్రస్తావించినా బీఆర్ఎస్ నేతలు ప్రెస్‌మీట్లు పెట్టి చంద్రబాబు వస్తున్నారు. చంద్రబాబును తెలంగాణకు శత్రువుగా చూపించడంలో బీఆర్ఎస్ అప్పట్లో సఫలమైంది. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును తెలంగాణ ద్రోణిగా ముద్ర వేసి కేసీఆర్ అధికారంలోకి వచ్చారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా చంద్రబాబు ప్రస్తావనను తెరపైకి తెచ్చే బీఆర్ఎస్ పార్టీకి.. 2023 ఎన్నికల్లో చంద్రబాబు ఆ అవకాశాన్ని ఇవ్వలేదు. ఆ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పోటీ నుంచి తప్పుకుంది. దీంతో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తెలుగుదేశం క్యాడర్ తమ వంతు పాత్ర పోషించింది. ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లోనూ తెలుగుదేశం శ్రేణులు కాంగ్రెస్ పార్టీకే మద్ద తుగా నిలిచారు.




అయితే, ఏపీలో మళ్లి తెలుగుదేశం అధికారంలోకి రావడంతో తెలంగాణలో బీఆర్ఎస్ నేతతో పాటు.. కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతలు ఆందోళన చేస్తున్నారు. వాస్తవానికి, చంద్రబాబు తెలంగాణలో తెలుగుదేశం బలోపేతంపై దృష్టిపెడితే కాంగ్రెస్ పార్టీ మేలే జరుగుతుంది. ఎందుకంటే.. రాష్ట్రంలో తెలుగుదేశం ఎంతగా బలోపేతం అయితే అంతగా బీఆర్ఎస్ ఓటు బ్యాంకుకు గండిపడుతుంది. తద్వారా కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుంది. కానీ, కాంగ్రెస్‌లోని కొందరు నేతలు చంద్రబాబు తెలంగాణ రాజకీయాలపై దృష్టిపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ, తెలంగాణకు మళ్లీ అన్యాయం జరుగుతుందన్నట్లు మాట్లాడారు. కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి ఓ అడుగు ముందుకేసి.. తిరిగి తెలంగాణ వాదులు, ఉద్యమకారుల పోరాట ప్రస్థానానికి కదలటం నిశ్చయమైన భవిష్యత్ వాస్తవం.. అంటూ కాంగ్రెస్ శ్రేణులసైతం ఆశావహులకు గురిచేస్తుంది. తెలంగాణలో రాజకీయాలు చేయాలంటే చంద్రబాబుకు హక్కులేదన్నట్లుగా కొందరు కాంగ్రెస్ నేతలు మాట్లాడటం పట్ల తెలుగుదేశం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మీరు అన్నట్లు చంద్ర బాబు తెలంగాణ వ్యతిరేకి అయితే.. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం ఎందుకు కలిసి పోటీచేశాయ్. 2023 ఎన్నికలలో తెలుగుదేశం కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి మద్ద తు ఇవ్వటం నిజం కాదా అని ప్రశ్నిస్తున్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులు తెలుగుదేశం జెండా పట్టుకుని ర్యాలీలలో పాల్గొనడం వాస్తవం కాదా అని ప్రశ్నిస్తున్నారు. బీజేపీ డైరెక్షన్‌లో చంద్రబాబు, పవన్ పని చేస్తున్నార'ని.. తెలంగాణాలో తెలుగుదేశం బలపడితే వచ్చే ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి పోటీ చేస్తానని, తద్వారా కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికర పరిస్థితి ఏర్పాడుతుందన్న వాదాన్ని కొందరు కాంగ్రెస్ నేతలు తెరపైకి తెస్తున్నారు. నిజానికి తెలంగాణలో బీజేపీ, జనసేన, తెలుగుదేశం కలిసి పోటీచేస్తే బీఆర్ఎస్ పార్టీ ఉనికే ప్రమాదంలో పడుతుంది. ఆ మూడు పార్టీల కలయిక వల్ల కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు వచ్చే నష్టం ఏమీ లేదు. అయితే కాంగ్రెస్ లోని కొందరు నాయకులు తెలంగాణలో చంద్రబాబు ఎంట్రీని వ్యతిరేకించడానికి ప్రధాన కారణం కాంగ్రెస్ లో రేవంత్ రెడ్డి బలోపేతం రన్న దుగ్ధతోనే అని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మొత్తానికి తెలంగాణలో తెలుగుదేశంలోపేతంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో రచ్చ రేపుతున్నాయి.

# రాఖీల మురిపెం! పెద్దపల్లి టూ ఫారిన్

పెద్దపల్లి: రక్షాబంధన్.. అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్లు.. సంబురంగా జరుపుకునే పండగ. ఆత్మీయత అనురాగాలను ప్రస్ఫుటం చేసేందుకు చిహ్నం రాఖీ. ఎవరి స్థాయి బట్టీ వారు రాఖీలు కొనుగోలు చేస్తారు. రకరకాల రాఖీలు కొనడానికి ఆడ పిల్లలు ఆసక్తి చూపుతారు. అయితే.. ఎంతో చూడముచ్చటైన రాఖీలు తెలంగాణలోని పెద్దపల్లిలో తయారు చేస్తున్నారంటే నమ్మరేమో. అవును.. ఇక్కడ తయారయ్యే రాఖీలకు పెద్ద ఎత్తున డిమాండ్? ఉంది. తక్కువ ధర, అనేక రకాల రాఖీలు ఉండడంతో ఆర్డర్లమీద ఆర్డర్లు వస్తునాయి. అందుకే.. ఇక్కడి నుంచి విదేశాలకు కూడా రాఖీలను ఎగుమతి చేస్తున్నారు.

పదేళ్ల క్రితం వరకు..

రక్షాబంధన్ వచ్చిందంటే రాఖీలకు గిరాకీ పెరుగుతుంది. పదేళ్ల క్రితం వరకూ కోల్?కతా, రాజస్థాన్ నుంచి రాఖీలు దిగుమతి అయ్యేవి. అక్కడి డీలర్లు ఎంత ధర చెప్తే.. అంతకు కొనాల్సిన పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం మన దగ్గరే రాఖీలు తయారు చేస్తుండడంతో ధరల కోసం డిమాండ్? చేయాల్సిన పరిస్థితి లేదు. అతి తక్కువ ధరకే పెద్దపల్లిలోని తయారవుతున్న అనేక రకాల రాఖీలు రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయి.

దేశవిదేశాల్లో పెద్దపల్లి రాఖీల విక్రయం

ఏపీ, తెలంగాణలో రాఖీలు తయారు చేసే ఏకైక కేంద్రం పెద్దపల్లి కావడంతో డిమాండ్? కూడా అదే స్థాయిలో ఉంది. తొమ్మిదేళ్ల కిందట పెద్దపల్లిలోని ఎస్ఆర్ఆర్ రాఖీ తయారీ కేంద్రాన్ని ఇల్లందుల కృష్ణమూర్తి ఏర్పాటు చేశారు. అనేక డిజైన్లలో తయారీ చేసి విక్రయిస్తున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో రాఖీలు ఇక్కడ మాత్రమే తయారు చేస్తున్నారు. ఇక్కడి నుంచి రెండు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. అలాగే ఛత్తీస్?గఢ్?, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక, ఒడిశా, హర్యానా, రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతోపాటు అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా దేశాలకు పెద్దపల్లిలో తయారైన రాఖీలు సరఫరా అవుతున్నాయి. లండన్‌లోని ఎస్.మార్ట్‌లో ఎస్ఆర్ఆర్ రాఖీలను విక్రయిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి పెద్దపల్లికి రాఖీల కోసం వ్యాపారులు వస్తుంటారు.

పది పైసల నుంచి

%ఇక్కడ తయారు అవుతున్న రాఖీలు పది పైసల నుంచి ?400 ధరకు లభిస్తున్నాయి. సుమారు 43 వేల రకాల రాఖీలను తయారు చేసి విక్రయిస్తున్నారు. బార్ కోడింగ్ పద్ధతిలో బిల్లింగ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లోని దుకాణాల్లో విక్రయించేందుకు ఈ ఏడాది పెద్ద ఎత్తున అక్కడి వ్యాపారులు



పెద్దపల్లి రాఖీలను కొనుగోలు చేశారు. గతంలో ?10కి దొరికే రాఖీలు ప్రస్తుతం ?2కే దొరుకుతున్నాయి.

2000 మందికి ఉపాధి

పెద్దపల్లి కేంద్రంగా తయారవుతున్న రాఖీల వల్ల సుమారు రెండు వేల మందికి ఉపాధి లభిస్తోంది. ఒక్కో మహిళ రోజుకు ?300 నుండి ?750 వరకు సంపాదిస్తున్నారు. ఒక చిన్న పరిశ్రమలా రాఖీలను ఉత్పత్తి చేస్తున్నారు.

ధర తగ్గింది.. ఉపాధి పెరిగింది

పెద్దపల్లిలో రాఖీ తయారీ కేంద్రం నెలకొల్పడంతో గతంలో కంటే 80 శాతం ధరలు తగ్గాయి. ఎస్ఆర్ఆర్ సీజన్ సెంటర్‌లో హోల్‌సెల్, రిటైల్‌లో రాఖీలు విక్రయిస్తున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి ముడిసరుకులు తీసుకువచ్చి రాఖీలు తయారు చేయడంతో ఈ ప్రాంతంలోని మూడు వేల మందికిపైగా మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం. జనవరి నుంచి ఆగస్టు వరకు 8 నెలలపాటు ఇట్లా ఉపాధి అవకాశాలు ఉంటాయి. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో మహిళలకు రాఖీల తయారీపై ఉచిత శిక్షణ ఇప్పిస్తాం. గతంలో కలకత్తా నుంచి తెచ్చి రాఖీలను విక్రయించే వాళ్లం. ఇప్పుడు 12 రాష్ట్రాలకు సరఫరా చేస్తుండడం సంతోషంగా ఉంది. రాబోయే ఏడాది దేశంలోని 29 రాష్ట్రాలకు రాఖీలను సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం.- ఇల్లందుల కృష్ణమూర్తి, ఎస్ఆర్ఆర్ రాఖీ సెంటర్

# శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో కస్టమ్స్ అధికారుల అవినీతి!?




హైదరాబాద్,విదేశీ కరెన్సీ అక్రమ రవాణా కేసులో రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయం (ఆర్.జీ.ఐ.ఏ)లోని కస్టమ్స్ అధికారులపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీ.ఐ.ఎస్.ఎఫ్.) ద్వారా భారీగా విదేశీ కరెన్సీ స్మగ్లింగ్ జరుగుతుందని ఈ ఏడాది మార్చి16న వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఈ కేసు నమోదైంది!అవును... 2023 మార్చి 16న శంషాబాద్ విమానాశ్రయంలో విదేశీ, భారతీయ కరెన్సీని సీ.ఐ.ఎస్.ఎఫ్. -సీ.ఐ.డబ్ల్యూ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రూ.4 లక్షల భారతీయ కరెన్సీని తీసుకెళ్తున్న హైదరాబాద్ కు చెందిన ఓ ప్రైవేటు వ్యక్తితో పాటు అతని కుమారుడి వద్ద రూ.2,93,425 కి సమానమైన వివిధ దేశాల కరెన్సీ నోట్లు ఉన్నాయని సీబీఐ అధికారులు ఎఫ్.ఐ.ఆర్.లో పేర్కొన్నారు.సీ.ఐ.ఎస్.ఎఫ్. సిబ్బందితో పాటు క్రైం అండ్ ఇంటెలిజెన్స్ అధికారులు శంషాబాద్ విమానాశ్రయంలో భారతీయ కరెన్సీతో పాటు విదేశీ కరెన్సీని మార్పిడి చేస్తున్నారన్న సమాచారంతో సిటీ సైడ్ అరైవల్ ఏరియాలో వీరిని పట్టుకున్నట్లు చెబుతున్నారు. వీరిలో శంషాబాద్ సిబ్బందితో పాటు కస్టమ్స్ విభాగంలో ఆఫీస్ బాయ్ గా పనిచేస్తున్న వ్యక్తి ఉన్నారని అంటున్నారు.ఇదే సమయంలో విదేశీ కరెన్సీ అక్రమ రవాణాకు సహకరించిన ముగ్గురు కస్టమ్స్ అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి. వీరిలో హైదరాబాద్ నిజాంపేటకు చెందిన ఏ.శ్రీనివాసులు, ఓల్డ్ బోయినపల్లికి చెందిన పంకజ్ గౌతమ్, సికింద్రాబాద్ కు చెందిన పేర చక్రపాణిలపై కేసులు నమోదు చేసినట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో నిందితులకు సంబంధించిన ఇళ్లు, ఆఫీసుల్లో సోదాలు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.అయితే ఈ విదేశీ కరెన్సీ స్మగ్లింగ్ గత కొంతకాలంగా జరుగుతున్నట్లు తదుపరి విచారణలో వెల్లడిందని అంటున్నారు. ఈ మేరకు సీ.ఐ.ఎస్.ఎఫ్. అధికారులు ఆ కరెన్సీని సీజ్ చేసి, తదుపరి చర్యల నిమిత్తం కస్టమ్స్ అధికారులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో విచారణ నిమిత్తం సీబీఐ అధికారులు కస్టమ్స్ డిపార్ట్మెంట్ సహాయాన్ని కోరింది!

# తెలంగాణ డీజీపీగా జితేందర్..?

హైదరాబాద్ : తెలంగాణ డీజీపీ మార్పు అని గత వారం పది రోజుల నుంచి వార్తలు షికారు చేస్తున్న సంగతి తెలిసిందే. మొత్తానికి డీజీపీ మార్పునకు సమయం ఆసన్నమైనట్లు కనిపిస్తోంది. అందుకు ముహూర్తం బుధవారం ఖరారు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్ జితేందర్‌ను నియామకం దాదాపు ఖరారైనట్లు సమాచారం. డీజీపీగా జితేందర్ నియామకంపై సీఎం రేవంత్ రెడ్డికూడా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే డీజీపీగా జితేందర్ నియామకంపై నిన్ననే ప్రభుత్వం ఉత్తర్వులు వెలువడాల్సి ఉన్నా.. సీఎం మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో ఉండటం కారణంగా వాయిదా పడినట్లు సమాచారం. డీజీపీ నియామకంపై బుధవారం అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

కాంగ్రెస్ ప్రభుత్వంలో తొలి డీజీపీ..!

ఈ ఉత్తర్వులు వెలువడితే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రేవంత్ సర్కార్ నియమించిన తొలి డీజీపీ జితేందర్ కానున్నారు. ప్రస్తుతం ఆయన డీజీపీ హోదాలోనే హోం శాఖ ముఖ్యకార్యదర్శిగా కొనసాగుతున్నారు. అలాగే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక ప్రస్తుత డీజీపీ రవిగుప్తాను అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు ఎన్నికల కమిషన్ నియమించిన సంగతి తెలిసిందే. అప్పట్లో డీజీపీగా ఉన్న అంజనీ కుమార్‌ను క్రమశిక్షణ చర్య కింద సస్పెండ్ చేసిన తర్వాత రవిగుప్తాను ఎంపిక చేసింది ఎన్నికల కమిషన్. అప్పట్నుంచే రవిగుప్తానే డీజీపీగా కొనసాగుతున్నారు. తాజాగా జితేందర్ వైపు సీఎం రేవంత్ రెడ్డి మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

అసలు ఎవరాయన..?

1992 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన జితేందర్.. పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో




రైతు కుటుంబంలో జన్మించారు. ఏపీ కేడర్‌కు ఎంపికయ్యారు. తొలి పోస్టింగ్ నిర్మల్ ఏఎస్పీగా పని చేశారు. ఆ తర్వాత బెల్లంపల్లి అదనపు ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. మహబూబ్‌నగర్, గుంటూరు జిల్లాల ఎస్పీగా కూడా సేవలందించారు. ఢిల్లీ సీబీఐలో, 2004 నుంచి 2006 వరకు గ్రేహౌండ్స్‌లో పని చేశారు. అనంతరం డీఐజీగా పదోన్నతి పొంది విశాఖపట్నం రేంజ్‌లో బాధ్యతలు స్వీకరించారు. అప్పాలో కొంతకాలం పని చేసి తెలంగాణ ఉద్యమ సమయంలో వరంగల్ రేంజ్ డీఐజీగా కొనసాగారు. ఏపీ సీఐడీ, ఎంక్వయిరీ కమిషన్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం హైదరాబాద్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ అదనపు కమిషనర్‌గా పని చేశారు. ఆ తర్వాత తెలంగాణ శాంతి భద్రతల విభాగం అదనపు డీజీపీగా, జైళ్ల శాఖ డీజీగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం హోం శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న జితేందర్ 2025 సెప్టెంబర్‌లో పదవీ విరమణ చేయనున్నారు. ఇప్పుడు డీజీపీగా నియమితులైతే 14 నెలల పాటు ఆ పదవిలో కొనసాగే అవకాశం ఉంది.

# షెడ్యూల్ ప్రకారమే గ్రూప్ 2 పరీక్షలు..?




హైదరాబాద్, రాష్ట్రంలో నిరుద్యోగులు ఆశపడుతున్నట్టుగా గ్రూప్ 2లో ఒక్క పోస్టు పెంచే ప్రసక్తే కనిపించడం లేదు. కనీసం అలాంటి ఆలోచన కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్నట్టు లేదని తెలుస్తున్నది. ఈ విషయంపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి కొంతవరకు స్పష్టత ఇచ్చారు. నిరుద్యోగులు కోరుతున్నట్టు పరీక్షలు వాయిదా వేసే ఆలోచనా చేయడం లేదని తెలుస్తున్నది. షెడ్యూల్ ప్రకారమే ఆగస్టు 7, 8 తేదీల్లో పరీక్షలు నిర్వహించడానికి టీజీపీఎస్సీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.జిల్లాల వారీగా పరీక్ష కేంద్రాలను గతంలోనే గుర్తించగా, పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఇప్పటికే జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రశ్నపత్రాలతోపాటు పరీక్షలకు నిర్వహణకు కావాల్సిన సామగ్రిని సిద్ధం చేస్తున్నట్టు టీజీపీఎస్సీ వర్గాల ద్వారా తెలుస్తున్నది. గ్రూప్ 2లో 2,000 పోస్టుల సంఖ్యను పెంచుతామని గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని ఆ పార్టీ తుంగలో తొక్కిందని నిరుద్యోగులు ఆందోళనకు దిగుతున్నారు.

## జగన్‌ను అప్రతిష్ట చేసేందుకే శ్వేతపత్రాలు

అమరావతి,ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేస్తున్న శ్వేత పత్రాల్లో అన్ని అసత్యాలే ఉంటున్నాయని, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ను బద్నాం చేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం చంద్రబాబు విద్యుత్ రంగంపై విడుదల చేసిన శ్వేతపత్రం పై ఆయన స్పందించారు.చంద్రబాబు పరిపాలనలోనే విద్యుత్ రంగం కుదేలు అయ్యిందని విమర్శించారు. బాబు అధికారం కోల్పోయిన నాటికి ఏపీ విద్యుత్ రంగంలో రూ. 86, 215 కోట్లు అప్పు ఉందని వెల్లడించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com